నేటి కందం-నేటికి అందం

విలువలు గలిగిన ఆర్థిక
సలహా మండలికి నేడు సంతోషముతో
పలు సూచనల లిడె మోడీ
కలవరములు లేని దీర్ఘ కాల ప్రగతికై !!

(భారత ఆర్థిక సలహా మండలిలో అధ్యక్ష హోదాలో భారత ప్రధానమంత్రి మోడీ పాల్గొని భారత దేశ దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పలు విధాలుగా సూచనలు చేశారు. మండలి సభ్యుల తోపాటు సామాన్య ప్రజలు కూడా మోడీ గారి మేధాసంపత్తికి ఆలోచనలకు జేజేలు పలుకుతున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

పాదయాత్ర రాష్ట్రంలో
పెడుతుందట ఇక కారు
ప్రజలెందుకు దించిండ్రో
పాశ్చాత్తాపమేది జోరు.
రాజకీయ విమర్శొకటే
రగిలి దెబ్బకొడుతుందా
నిన్నటి అవినీతి మచ్చ
నీడ వదిలిపెడుతుందా.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 9-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:239 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రతి నియోజకవర్గంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 8:అంబేడ్కర్ భవన స్థలంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. దీనికోసం రూ.110 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి, మంజూరు చేశామని పేర్కొన్నారు. 12 అంతస్తులో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈరోజు (సోమవారం) లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా సందర్శించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు.



ఈ నాలెడ్జ్ సెంటర్ కోసం ప్రభుత్వం రూ. 110 కోట్లు నిధులు కేటాయించిందని.. అందులో ఈరోజు రూ.50 కోట్లు మంజూరు చేశామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ నాలెడ్జ్ సెంటర్ నిరుపేద విద్యార్థులకు శిక్షణ ఇస్తోందని చెప్పుకొచ్చారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల వరకు ఈ భవన నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఈ నాలెడ్జ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు, డిజిటల్ లైబ్రరీ, వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో సెమినార్స్ నిర్వహించి విజ్ఞానాన్ని అందరికి పంచుతామని వివరించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తావని వెల్లడించారు. లోయర్ ట్యాంక్ బండ్ అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్‌తో పాటు నింబోలి అడ్డలోని ఎస్సీ హాస్టల్ ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దానికి బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌గా నామకరణం చేస్తున్నామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.


## బీఆర్ఎస్ ఆరోపణలకు శ్రీధర్‌బాబు కౌంటర్

హైదరాబాద్, జూన్ 8: బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. మీడియాతో మాట్లాడుతూ పలు అంశాలపై ఆయన స్పందించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిట్లర్, నాజీ సిద్ధాంతాలకు మద్దతు ఇస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని శ్రీధర్‌బాబు ఖండించారు. సీఎం ఎప్పుడూ హిట్లర్ సిద్ధాంతాలను అనుసరిస్తామని చెప్పలేదని స్పష్టం చేశారు. ఏదైనా లక్ష్యాన్ని సాధించే వరకు విరమించకుండా కృషి చేసే వ్యక్తిని ఉదాహరణగా మాత్రమే ప్రస్తావించారు. ఏ పనినైనా పట్టుదలతో పూర్తి చేయాలనే ఉద్దేశంతో సీఎం మాట్లాడారని మంత్రి వివరించారు.

హైడ్రా చర్యలపై వస్తున్న ఆరోపణలను కూడా శ్రీధర్‌బాబు తిప్పికొట్టారు. భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటుండటంతో కొందరు అసహనానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. హైడ్రా పూర్తిగా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎబోలా అలర్ట్.. స్క్రీనింగ్ కట్టుదిట్టం: మంత్రి దామోదర్



హైదరాబాద్, జూన్ 8: ఎబోలాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నామని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఎబోలాపై శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో స్క్రీనింగ్, సర్వైలెన్స్ మరింత కట్టుదిట్టం చేశామని పేర్కొన్నారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై 21 రోజుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈరోజు (సోమవారం) రాష్ట్ర సచివాలయంలో ఎబోలా అప్రమత్తతపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ఇద్దరు అనుమానితులకు ఎబోలా నెగిటివ్ వచ్చిందని.. మరోసారి నమూనాల కోసం పరీక్ష చేశామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో ఐసోలేషన్ సదుపాయాలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఎబోలా టెస్టింగ్ కిట్లు అందాయని.. పరీక్షలు ప్రారంభించినట్లు సీసీఎంబీ అధికారులు తెలిపారు. తప్పుడు చిరునామాలు ఇచ్చే ప్రయాణికులపై కేసులు నమోదు చేస్తామని మంత్రి దామోదర్ హెచ్చరించారు. ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ కింద చర్యలు చేపట్టాలని అధికారులను.. మంత్రి ఆదేశించారు.

ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషా సిబ్బందిని విమానాశ్రయంలో ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం ఆరోగ్యం- పోలీసు - ఎయిర్‌పోర్ట్ శాఖలు సమన్వయం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎబోలా నివారణకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని.. అపోహలు నమ్మొద్దని చెప్పారు. కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాలతో తమ ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.

## తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌తో ఎరువుల అక్రమాలకు అడ్డుకట్ట: మంత్రి తుమ్మల

హైదరాబాద్, జూన్ 8:రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు.

దేశవ్యాప్తంగా ఈయా ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈయా యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు.

ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల్లోని పోర్టుల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు.

రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం.. పలువురి మృతి

విశాఖపట్నం, జూన్ 8:: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఈరోజు (సోమవారం) భారీ ప్రమాదం జరిగింది. ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ షాప్-1 ) పరిధిలోని సీసీడీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ల్యాడల్‌లో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తుండగా, కొందరు మృతి చెందినట్లు సమాచారం. అయితే మరణాల సంఖ్యపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ యాజమాన్యం అత్యవసర భద్రతా చర్యలు చేపట్టింది. గాయపడిన కార్మికులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ప్లాంట్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.

ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడల్‌లోని ద్రవ లోహం ఎందుకు కిందపడింది., సాంకేతిక లోపమా.. లేక భద్రతా ప్రమాణాల్లో ఏవైనా నిర్లక్ష్యం జరిగిందా.. అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అధికారిక నివేదిక వచ్చిన తర్వాతే గాయపడిన వారి సంఖ్య, మరణాల వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## నాంపల్లి పరిసరాల్లో ట్రాఫిక్ డైవర్షన్: సీపీ సజ్జనార్

హైదరాబాద్, జూన్ 8:చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు.



భద్రతా ఏర్పాట్లు

చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు.

హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే రేపు వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

## సర్‌పై సీజేఐకి పిటీషన్, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఇండియా బ్లాక్ తీర్మానం




న్యూ ఢిల్లీ, జూన్ 8:ఇండియా కూటమికి చెందిన నేతలు ఇవాళ ఢిల్లీలో మీటింగ్ నిర్వహించారు. కానిస్టిట్యూషన్ క్లబ్‌లో ఆ నేతలు భేటీ అయ్యారు. ఇండియా బ్లాక్ పార్టీలకు చెందిన నేతలు అయిదు అంశాలపై ఓ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి కలుసుకోవాలని తీర్మానించారు. ఇక కీలకమైన ఎజెండాలో భాగంగా.. భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని కూటమి నేతలు అంగీకరించారు. స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ద్వారా ఓట్ల లూటీ జరుగుతున్నట్లు సీజేఐకి చెప్పాలని నేతలు భావించారు. దీంతో పాటు ఇటీవల ప్రవేశ, ఉద్యోగ పరీక్షల కు చెందిన ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు.

ఇవాళ జరిగిన మీటింగ్‌లో 23 పార్టీలకు చెందిన ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు. సర్ గురించి సీజేఐకి లేఖ రాయాలని అన్ని పార్టీలు ఏకగ్రీవంగా అంగీకరించాయి. ఓట్ల లూటీ జరుగుతోందని, ఎన్నికలను చోరీ చేస్తున్నారని పార్టీలు ఆరోపించాయి. త్వరలోనే సీజేఐకి లేఖను రాయనున్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఏకగ్రీవం గా నిర్ణయించారు. నీట్, సీబీఎస్ఈ పరీక్షలు రాసిన లక్షలాది మంది విద్యార్థులను ద్రోహం చేశారని నేతలు ఆరోపించారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సమస్యల గురించి చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని కోరారు.

## నెతన్యాహుకు వేరే ఛాన్స్ లేదు.. ఇరాన్‌తో ఒప్పందానికి అంగీకరించాల్సిందే : డొనాల్డ్ ట్రంప్

న్యూ ఢిల్లీ, జూన్ 8:ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టంచేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ చెప్పారు. ఇక్కడ తానే అన్ని నిర్ణయాలు తీసుకుంటానని, నెతన్యాహు కాదని అన్నారు. భవిష్యత్తులో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందేనని ట్రంప్ వ్యాఖ్యానించారు.

కాగా ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఇరాన్‌పై ఎదురుదాడి చేయొద్దని నెతన్యాహును ట్రంప్ కోరనున్నట్లు సమాచారం.

ఇలాంటి సైనిక చర్యలవల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ.. 'మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి' అని పిలుపునిచ్చారు.

అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర స్థాయికి.. దేశ పౌరులకు భారత ప్రభుత్వం ఫ్రెష్ అడ్వయిజరీ



న్యూ ఢిల్లీ, జూన్ 8: పశ్చిమాసియా లో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. దాంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని భారత పౌరులను మరోసారి హెచ్చరించింది. ఈ మేరకు టెహ్రాన్ లోని భారత రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. 'ఇక్కడి తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దు. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా స్వదేశానికి వెళ్లిపోవాలి' అని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టంచేసింది.

ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీచేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు.

అమెరికా పచ్చజెండా ఊపడంతోనే ఇజ్రాయెల్ ఫాస్పరస్ బాంబుల వంటి నిషేధిత ఆయుధాలను వాడుతూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని అలీ అబ్దుల్లాహీ ఆరోపించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, ఇతర సైనిక ఉన్నతాధికారులు మరణించడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పలుచోట్ల డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే శాంతి స్థాపన కోసం ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి.

# ఒంటరితనం పట్ల అవగాహనకు బహిరంగంగా చర్చిద్దాం !

## (09 - 15 జూన్ "ఒంటరితనం అవగాహన వారోత్సవాలు" సందర్భంగా)

ఒంటరితనం ఓ మానసిక భావోద్వేగ ప్రక్రియ. కొందరికి ఒంటరితనం లేదా ఏకాంతం ఓ అద్భుత అవకాశంగా నిలిస్తే మరి కొందరిలో ఒంటరితనం ఓ అవాంఛనీయ అనారోగ్యకర సమస్యగా నిలుస్తున్నది. దాదాపు 50 శాతం జనాభా అంతర్ముఖులుగా ఒంటరితనాన్ని కోరుకుంటారు, అనారోగ్యాల బారిన పడతారు. కొందరికి ఒంటరితనం వరమయితే మరి కొందరికి అది శాపంగా మారుతోంది. పరిమిత ఒంటరితనం శారీరక, మానసిక వికాసానికి, సానుకూల భావనలు జనించడానికి దోహదపడుతుంది. మితి మీరిన ఒంటరితనం ప్రమాదకరంగా మారి చివరికి ప్రాణాంతకం కూడా అవుతుంది. ఒంటరితనాన్ని మనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తే అది వ్యక్తి సంపూర్ణ శ్రేయస్సుకు ఉపకరిస్తుంది. ఒంటరితనానికి, ఏకాంతవాసానికి తేడా ఉన్నది. ఒంటరితనం అనేది ఒక భావోద్వేగ ప్రతికూల స్థితి. తాను ఇతరులతో కనెక్ట్ కావాలని కోరుకున్నప్పటికీ, వారి చుట్టు ఎవరూ లేరని భావించడాన్ని ఒంటరితనం అనవచ్చు. ఏకాంతం అనేది ఒక వ్యక్తి కావాలని ఒంటరిగా ఉండడం, తమ చుట్టు పక్కలకు దూరంగా ఉంటూ ఆలోచనలు చేయడం అని అర్థం చేసుకోవాలి. ఏకాంతం అనేది ఒక ఆశావహ ప్రయోజనకర మానసిక స్థితి.

ఒంటరితనం అవగాహన వారోత్సవాలు :

ఒంటరితనం అనేది రుగ్మతగా మారితే అత్యంత ప్రమాదకరం అవుతుందని, దాని పట్ల ప్రజలకు కనీస పరిజ్ఞానం అందించడానికి ప్రతి ఏట 09 నుంచి 15 జూన్ వరకు "ఒంటరితనం అవగాహన వారోత్సవాలు లేదా లోన్లీనెస్ అవేర్‌నెస్ వీక్" పాటించడం జరుగుతోంది. 2026 ఒంటరితనం అవగాహన వారం ఇతివృత్తంగా "ఒంటరితనానికి వ్యతిరేకంగా గళం విప్పుదాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తారు. సహజమైన మానవ భావోద్వేగ ఒంటరితనం పట్ల ప్రజల్లో కళంకంగా భావించబడుతున్న వేళ దానిని అధిగమించడానికి పౌర సమాజం కూడా కృషి చేయాలి. ఒంటరితనం పట్ల నిర్భయంగా, బహిరంగంగా చర్చలు చేయాలి. ఒంటరితనం వలయంలో చిక్కిన అభాగ్యులతో మాట్లాడుతూ వారితో మానవ సంబంధాలు, సంభాషణలు పెరిగే విధంగా చూద్దాం.

ఒంటరితనం దుష్ప్రభావాలు:

నిశ్శబ్ద రుగ్మతగా సమాజంలో వ్యాపిస్తున్న ఒంటరితనాన్ని ఒక దురాచారంగా లేదా ప్రతిష్టకు మచ్చగా నిలుస్తున్న వేళ దాని పట్ల అవగాహన కల్పించడం జరగాలి. దీర్ఘకాలం పాటు ఒంటరితనాన్ని అనుభవించిన వారిలో తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం హద్దులు మీరితే మతిమరుపు, హృదయనాళ అనారోగ్య సమస్యలు, స్ట్రోక్, నిరాశ, ఆందోళన, అకాల మరణాలు, అలసట, ఆత్మన్యూనత భావం, మానసిక ఒత్తిడి లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. ఒంటరితనం ఫలితంగా శారీరక, మానసిక, భావోద్వేగ, సామాజిక ప్రతికూలతలతో పాటు మానవ సంబంధాల సమస్యలు ఉత్పన్నం అవుతాయి.

ఏకాంతవాసం వల్ల ప్రయోజనాలు:

కొందరు వ్యక్తుల్లో ఒంటరితనం లేదా ఏకాంతవాసం పలు ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. వ్యక్తిగత ఎదుగుదల, ఆత్మ విమర్శ చేసుకునే అవకాశం, గత లోపాలను సరిదిద్దుకునే ఆలోచనలు, రేపటి ప్రణాళికల రచనలు, తనలోని బలాలు/ బలహీనతలను విశ్లేషించుకునే సదవకాశం, లక్ష్యాసాధన మార్గాల అన్వేషణలు, తన గూర్చి తాను ఆలోచించుకోవడం, సృజనశీల ఆలోచనలు, ఉత్పత్తికి ఊతం, ఏకాగ్రత పెరుగుదల, ఇతరుల ప్రభావాలకు దూరంగా స్వతంత్ర భావాలకు పట్టం కట్టడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, సమతుల సామాజిక సంబంధాల్లో ప్రగతి, ఆత్మ విమర్శకు అవకాశం, విశ్రాంతి దొరకడంతో రేపటికి శక్తిని కూడగట్టుకోవడం లాంటి అనేక ప్రయోజనాలు ఒంటరితనానికి లేదా ఏతడకాంతవాసానికి ఉంటాయి.

ఒంటరితనాన్ని ఓడించడం ఎలా ?

ఒంటరితనాన్ని ఓడించి చురుకుగా, సరదాగా సమాజంతో మమేకం అవుతూ జీవితాన్ని ఆస్వాదించడానికి కొని చిట్కాలను తెలుసుకుందాం. మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలివిడిగా ఉండడం, చొరవ తీసుకొని ఇతరులతో మాట్లాడడం, మన అభిరుచులకు తగిన బంధువులు/మిత్రులతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వేదికల్లో గడపడం, మనకు ఇష్టమైన పనులను చేసి ఆలడనందాన్ని పొందడం, మన భావాలను దగ్గరి వారితో పంచుకోవడం/పరిష్కార మార్గాలను తెలుసుకోవడం, ఒంటరిగా, ముభావంగా ఉండే వారికి దగ్గర కావడం లాంటి చర్యలు ఒంటరితనమనే రుగ్మతను దూరం చేస్తాయి. ఒంటరితనాన్ని పరిమితం చేస్తూ, పౌర సమాజంతో దగ్గరవుతూ, సంతోష సాగరంలో మునుగుతూ, జీవితాన్ని సుసంపన్నం చేసుకుంటూ, ఎంపిక చేసుకున్న లక్ష్యాలను అధిగమిస్తూ, అందరి మన్ననలు పొందుతూ, చలాకీగా ప్రవర్తిస్తూ ఆయుకారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉందాం, ఆనందాన్ని పంచుదాం.



-మధుపాళీ
9949700037

# లీగల్ మెట్రాలజీ ఫ్రేమ్‌వర్క్ పరిధిలో వంట నూనెల ప్రామాణిక ప్యాక్ పరిమాణాలను నిర్ణయించిన వినియోగదారుల వ్యవహారాల శాఖ

న్యూ ఢిల్లీ, జూన్ 8:వినియోగదారుల పారదర్శకతను పెంపొందించడం, నిష్పక్షపాత వాణిజ్య పద్ధతులను ప్రోత్సహించడంలో భాగంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ ఒక కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా లీగల్ మెట్రాలజీ ఫ్రేమ్‌వర్క్ పరిధిలో తినే నూనెలు, కొవ్వుల నికర పరిమాణం, ప్రామాణిక ప్యాక్ పరిమాణాల నిర్ధారణ కోసం 29.12.2023 నాటి ఎస్ఓపీని (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) సవరించింది.

దేశంలోని దాదాపు 90 శాతం తినే నూనెల రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన వంట నూనెల (ఎడిబుల్ ఆయిల్) పరిశ్రమల సంఘాలతో విస్తృతంగా చర్చలు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. మార్కెట్‌లో విభిన్న పరిమాణాల ప్యాకేజీలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల వినియోగదారులు ధరలను పోల్చుకుని సరైన నిర్ణయం తీసుకోవడం కష్టంగా మారుతోంది. ఈ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కొత్త చర్యను చేపట్టారు.

ప్రధాన వంట నూనెలు, మిశ్రమ వంట నూనెల విషయంలో సవరించిన ఎస్ఓపీ.. ప్రామాణిక ప్యాక్ పరిమాణాలను నిర్దేశిస్తుంది. ఇందులో పామాయిల్, సోయాబీన్ నూనె, సన్‌ఫ్లవర్ నూనె, ఆవ నూనె, వేరుశనగ నూనె, నువ్వుల నూనె, రైస్ బ్రాన్ నూనె, పత్తి గింజల నూనె, మొక్కజొన్న నూనె ఉన్నాయి.

ఈ ప్రామాణిక పరిమాణాలు వినియోగదారులు వివిధ బ్రాండ్ల ధరలను మరింత సులభంగా పోల్చుకోవడానికి, సరైన కొనుగోలు నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడతాయి.

200 మి.లీ లేదా 200 గ్రాముల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్యాకేజీలకు ఈ ప్రామాణీకరణ వర్తించదు. దీనివల్ల వినియోగదారులకు తక్కువ ధరల్లో లభించే చిన్న ప్యాక్‌లు యథావిధిగా అందుబాటులో ఉంటాయి. తక్కువగా వాడే ఇతర నూనెలకు (మైనర్ ఆయిల్స్) కూడా ఈ ప్రామాణిక ప్యాక్ పరిమాణ నిబంధన నుంచి మినహాయింపు ఉంది.

ఒకవేళ వంట నూనె పరిమాణాన్ని లీటర్లు లేదా మిల్లీలీటర్లలో చూపించినట్లయితే ప్యాకేజీపై దానికి సమానమైన బరువును కూడా స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరి. లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్ చేసిన సరుకులు) నిబంధనలు- 2011 ప్రకారం ఈ నిబంధనను పాటించాల్సి ఉంటుంది. ఇది వినియోగదారులు వివిధ బ్రాండ్ల ఉత్పత్తులను మరింత సులభంగా పోల్చుకోవడానికి, మెరుగైన కొనుగోలు నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది.

ఈ కొత్త నిబంధనలు భారత దేశంలో తయారయ్యే వాటితో పాటు దిగుమతి చేసుకునే వంట నూనెలకు వర్తిస్తాయి. శాంప్లింగ్, టెస్టింగ్, నికర పరిమాణాన్ని తనిఖీ చేయడం.. అనుమతించదగిన లోపాలకు సంబంధించిన ప్రస్తుత నిబంధనలు యథావిధిగా ఎస్ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్), లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్ చేసిన సరుకులు) నిబంధనలు- 2011 పరిధిలోనే కొనసాగుతాయి. ఈ కొత్త నిబంధనలను అమలు చేయడానికి తయారీదారులు, ప్యాకర్లు, దిగుమతిదారులకు మూడు నెలల సమయం (ట్రాన్సిషన్ పీరియడ్) ఉంది. నిర్ణీత పరిమాణాల ప్యాకేజింగ్ విధానాన్ని ముందుగానే అమలు చేయాలనుకునే వ్యాపార సంస్థలు వెంటనే ప్రారంభించొచ్చు.

ఈ ప్రామాణిక ప్యాక్ పరిమాణాల ప్రవేశం వల్ల వినియోగదారులు వివిధ బ్రాండ్ల ధరలను మరింత సులభంగా పోల్చుకోవడానికి, తాము పెట్టే ఖర్చుకు తగిన విలువను అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. ఇది వినియోగదారులు మరింత పారదర్శకంగా, సరైన కొనుగోలు నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. ఈ నిర్ణయం ప్యాకేజింగ్ విధానాలలో మరింత ఏకరూపతను తీసుకురావడం ద్వారా వంట నూనెల పరిశ్రమకు కూడా ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రామాణిక ప్యాక్ పరిమాణాలు నిబంధనల అమలును సులభతరం చేస్తాయి. ఇవి తయారీదారులు, దిగుమతిదారుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహిస్తాయి. మార్కెట్‌లో మరింత పారదర్శక వాతావరణాన్ని సృష్టించడంలో కూడా ఇవి సహాయపడతాయి.

మార్కెట్‌లో పారదర్శకత, నిష్పక్షపాత వాతావరణం, వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందించే సంస్కరణల ద్వారా వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడానికి వినియోగదారుల వ్యవహారాల శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది.

# త్రిపుర సరిహద్దు ప్రాంతాల సమస్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జూన్ 8:త్రిపురలోని సల్‌బగన్‌లో ఆ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల సమస్యలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా సమీక్షించారు. ఈ సమావేశంలో త్రిపుర ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర సీనియర్ అధికారులతో పాటు త్రిపురలోని మొత్తం 8 సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పీలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మరింత మెరుగైన సమన్వయంతో సరిహద్దుల సమగ్ర నిర్వహణను పటిష్ఠం చేయడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు.

సరిహద్దు భద్రత కేవలం ఒక విభాగానికి పరిమితమైన విధి కాదని, అది అన్ని ప్రాంతాల బాధ్యత అని కేంద్ర హోం మంత్రి పేర్కొన్నారు. జిల్లా మేజిస్ట్రేట్లు, ఎస్‌పీలు, పట్వారీలు, సర్పంచ్‌లు, ఆధునిక సాంకేతికతలు, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అందరినీ కలుపుకుంటూ ఒక పటిష్ఠమైన భద్రతా వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సరిహద్దు భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రతి సరిహద్దు ప్రాంతాన్ని బలోపేతం చేస్తోందని శ్రీ అమిత్ షా అన్నారు. కేవలం కంచె వేయడం మాత్రమే కాకుండా స్థానిక పరిపాలన, స్మార్ట్ సాంకేతికత, బీఎస్ఎఫ్‌లతో కూడిన సంపూర్ణ భూభాగ రక్షణ ద్వారా మాత్రమే పూర్తి సురక్షితమైన, అభేద్యమైన సరిహద్దు వ్యవస్థ సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాలు, ఆయుధాల ముప్పును ఎదుర్కొనేలా సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలని కేంద్ర హోం మంత్రి ఆదేశించారు. ఈ శిబిరాల్లో పట్వారీలు, స్థానిక పోలీసులు, బీఎస్ఎఫ్ సిబ్బంది తప్పనిసరిగా భాగస్వాములయ్యేలా చూసుకోవాలని ఆయన సూచించారు.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించిన సీసీటీవీ మోడల్‌ను మొదటగా త్రిపురలో అమలు చేయాలని కేంద్ర హోం మంత్రి ఆదేశించారు. బీఎస్ఎఫ్‌కు చెందిన ప్రతి కెమేరాను అప్‌గ్రేడ్ చేసి జిల్లా పరిపాలనా యంత్రాంగంతో అనుసంధానించాలని తెలిపారు.

మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణాను నిరోధించేందుకు తరచుగా ఆపరేషన్లు నిర్వహించాలని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సరఫరా ముఠాలో భాగస్వాములైన వారందరిపై కఠినమైన, ఎలాంటి కనికరం లేకుండా ఉక్కుపాదం మోపాలని ఆయన స్పష్టం చేశారు.

సరిహద్దు జిల్లాల్లో ఆర్థిక క్రమశిక్షణను నిర్ధారించడం రాష్ట్రాల బాధ్యత కూడా అని కేంద్ర హోం మంత్రి అన్నారు. ఈ విషయమై కలెక్టర్లు, జీఎస్టీ అధికారులకు శిక్షణ ఇవ్వాలని.. అలాగే నకిలీ నోట్లపై సీబీడీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్) ఒక సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

సరిహద్దుల వెంబడి జరిగే ఆర్థిక లావాదేవీలు, పెద్ద ఎత్తున జరిగే భవన నిర్మాణాలు, ఆస్తుల కొనుగోలు, విక్రయాలపై తీవ్ర నిఘా ఉంచాలని శ్రీ అమిత్ షా కోరారు. గత ఐదేళ్ల భూరికార్డులను సమగ్రంగా పరిశీలించాలని ఆయన ఆదేశించారు.

అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అత్యున్నత స్థాయి భద్రతను నిర్ధారించడానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గట్టిగా కట్టుబడి ఉందన్న విషయాన్ని ఈ సమావేశం తెలియజేసింది. సరిహద్దు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య అత్యంత సన్నిహిత సమన్వయాన్ని పెంపొందించడంపై కూడా ఈ సమావేశం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

# మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలి

## -పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలను పెంచాలి:
## -జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా



చిత్తూరు, జూన్ 8:మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలని, పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మెనూ చార్జీలను పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు సుమతి, రాజేశ్వరి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, మధ్యాహ్న భోజన పథకం జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులకు భోజనం వండిపెడుతూ వారి ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. బిల్లులు సకాలంలో వచ్చినా, రాకపోయినా నిరంతరం సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల సమయంలో మహిళా కార్మికులకు అండగా ఉంటామని రాజకీయ పార్టీలు హామీలు ఇస్తున్నప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం నెలకు కేవలం రూ.3 వేల వేతనంతోనే పనిచేస్తున్నామని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో జీవనం భారంగా మారిందని చెప్పారు.

పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలంటే ప్రస్తుతం ఉన్న చార్జీలు సరిపోవడం లేదన్నారు. ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు ఒక్కో భోజనానికి కనీసం రూ.15, హైస్కూల్ విద్యార్థులకు రూ.20 చొప్పున మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్యాస్ ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేయడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. పాఠశాలలకు అవసరమైన గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాలని కోరారు.

# కదిరిలో బీజేపీ వైపు పెరుగుతున్న ఆకర్షణ

## -300 మందికి పైగా నాయకులు, కార్యకర్తల చేరిక

అమరావతి, జూన్ 8:కదిరి పట్టణం, కదిరి రూరల్ మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన చేరికల కార్యక్రమంలో దాదాపు 300 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువాలు ధరించి అధికారికంగా బీజేపీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకట నారాయణరెడ్డి, కదిరి పట్టణానికి చెందిన వెంకటరెడ్డి, కుటాగుళ్లకు చెందిన మహిళా నేత నాగేశ్వరి, ప్రముఖ వైద్యుడు జ్ఞానేశ్వర్‌తో పాటు మైనారిటీ వర్గానికి చెందిన పలువురు నాయకులు తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, జాతీయవాద భావజాలం, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలో నాయకత్వంలో అమలవుతున్న పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చాయని ఆయన అన్నారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరడం పార్టీపై రోజురోజుకూ పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్న ఆయన, పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలికారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేసి కదిరి ప్రాంతంలో బీజేపీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రొద్దం ఉత్తమ్ రెడ్డి, బూదిలి సుదర్శన్, డి.ఎల్. ఆంజనేయులు, మేకల నాగార్జున, యువ మోర్చా నాయకులు ప్రతాప్, మైనారిటీ నాయకులు ఇంతియాజ్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ మైనుద్దీన్, రామచంద్రరెడ్డి, ఎర్రంశెట్టి రమేష్ బాబు, విడగొట్టు శ్రీనివాసులు, కుటాగుళ్ల సూర్యశేఖర్ రెడ్డి, నందిశెట్టి బాబు, తెలపాటి రవీందర్ నాయుడు, తిమ్మరాజు జనార్ధన్, మంజు నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కదిరి ప్రాంతంలో ఇటీవల బీజేపీ కార్యక్రమాలకు ప్రజల నుంచి పెరుగుతున్న స్పందన, వివిధ వర్గాల నాయకుల చేరికలు పార్టీ విస్తరణకు దోహదపడుతున్నాయని పార్టీ అభిప్రాయపడ్డారు.

# సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసాం

## -ఓట్లు తొలగించకుండా జాగ్రత్తపడండి



అమరావతి, జూన్ 8: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జిలు, కో క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, కోయూనిట్ ఇంచార్జిలు, నిర్వహించిన వర్క్‌షాప్ లో మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ నాయకులకు సూచించారు.

ప్రతి ఒక్క ఓటు కీలకమని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా టీడీపీ మద్దతుదారుల ఓట్లు తొలగించబడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సుపరిపాలన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో మరోసారి కూటమిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ? ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటేనే ఆంధ్రప్రదేశ్‌లో ఊహించని స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

నియోజకవర్గంలో 1.51 లక్షల కోట్ల పెట్టుబడులతో భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. కూటమి పాలనలో కేవలం రెండేళ్ల వ్యవధిలోనే నియోజకవర్గం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందన్నారు. కార్యక్రమానికి ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పెట్రోల్ బంక్‌లో రూ.74 లక్షల గోల్‌మాల్..

## -సబ్‌జైలు వార్డెన్‌పై చీటింగ్ కేసు

అమరావతి, జూన్ 8: జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌లో సుమారు రూ.74 లక్షల మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు వెలుగులోకి రావడం జిల్లాలో సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో సబ్‌జైలు హెడ్ వార్డెన్‌గా పనిచేసిన రామచంద్రా రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, బనగానపల్లె పట్టణంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ ఆర్థిక లావాదేవీలు 2022 నుంచి 2025 ఏప్రిల్ వరకు అప్పటి హెడ్ వార్డెన్ రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో సాగాయి. పెట్రోల్ విక్రయాల ద్వారా వచ్చిన మొత్తంలో కొంత భాగాన్ని ప్రతిరోజూ ఫోన్‌పే చెల్లింపుల రూపంలో పెట్రోల్ బంక్ సిబ్బంది ద్వారా తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించి, సుమారు రూ.74 లక్షలు దుర్వినియోగం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై జిల్లా జైళ్ల శాఖ సూపరింటెండెంట్ యోగేష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖైదీల సహకారంతో నిర్వహిస్తున్న సబ్‌జైలు పెట్రోల్ బంక్ లావాదేవీల్లో భారీ వ్యత్యాసాలు గుర్తించడంతో అధికారులు అంతర్గతంగా పరిశీలన చేపట్టినట్లు సమాచారం.

# దేశానికి యువతే అతిపెద్ద బలం, వికసిత్ భారత్ సాధనలో వారిది కీలకపాత్ర

న్యూ ఢిల్లీ, జూన్ 8:న్యూఢిల్లీలోని త్యాగరాజ్ క్రీడా ప్రాంగణంలో నేడు నిర్వహించిన 'యూత్ ఫర్ వికసిత్ భారత్: మై భారత్ యూత్ కాన్వెన్షన్' సమ్మేళనంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన 6,000 మందికి పైగా యువతీ యువకులు హాజరయ్యారు. ఇందులో విద్యార్థులు, యువ నిపుణులు, యువతులు, పారిశ్రామికవేత్తలు, కంటెంట్ క్రియేటర్లు, ఆవిష్కర్తలు, యువ నాయకులు, వివిధ రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విజేతలు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత పోషించాల్సిన విప్లవాత్మక పాత్రను, 2047 నాటికి భారత్‌ను ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చే ప్రయాణంలో వారి భాగస్వామ్యాన్ని ఈ సమావేశం ప్రతిబింబించింది.

మై భారత్ యువ సమ్మేళనంలో ప్రముఖ గాయని, ఎమ్మెల్యే శ్రీమతి మైథిలి ఠాకూర్, ప్రముఖ నటుడు శ్రీ విక్రాంత్ మాస్సే, పారిశ్రామికవేత్త శ్రీ అమన్ గుప్తా, భారత క్రికెటర్ శ్రీ జితేష్ శర్మ పాల్గొని మై భారత్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో సంభాషించారు. వారు తమ జీవిత అనుభవాలను యువతతో పంచుకున్నారు. ప్రతి రంగంలోనూ గొప్పగా రాణించాలని, దేశ అభివృద్ధిలో అర్థవంతమైన పాత్రను పోషించాలని యువతను ఉత్సాహపరిచారు.

6,000 మందికి పైగా యువకులు పాల్గొన్న ఈ యువజన సదస్సు, దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రధాన యువజన భాగస్వామ్య కార్యక్రమాలను ప్రదర్శించింది.

ఈ సదస్సులో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రసంగిస్తూ.. దేశానికి యువతే అత్యంత గొప్ప శక్తి అని, వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేయడంలో వారే కీలకమని తెలిపారు. దేశ జనాభాలో దాదాపు 65 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న వారే ఉన్నారని చెప్పారు. మన దేశానికి ఉన్న ఈ జనాభా పరమైన ఆధిక్యతను దేశ ప్రగతి కోసం అద్భుతంగా ఉపయోగించుకోవాలని ఆయన ఈస్పష్టం చేశారు.

"యువతే మన శక్తి, మన గర్వం, మన సంకల్పం, మన భవిష్యత్తు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో నవ భారత యువత సరికొత్త ఆవిష్కరణలు చేయడానికి, తమ ప్రతిభను చాటడానికి, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావడానికి మునుపెన్నడూ లేని విధంగా అపూర్వమైన అవకాశాలు లభించాయి. అంకుర సంస్థలు, క్రీడలు, ప్రజా సేవ, పారిశ్రామిక రంగం లేదా సృజనాత్మక రంగాలు.. ఇలా ఏ రంగంలో చూసినా భారతీయ యువత తమ అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నారు" అని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కొనియాడారు.

యువతలోని నైపుణ్యాలను, సామర్థ్యాలను సరైన దిశలో పెంపొందించి, దేశ నిర్మాణానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో మై భారత్ వేదిక చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు.

ఇటీవల మై భారత్ సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఘనతను ఆయన అభినందించారు.

యువత ఈ వేదికలో చురుగ్గా భాగస్వామ్యమవ్వాలని, ఇందులో లభించే స్వచ్ఛంద సేవ అవకాశాలను ఉపయోగించుకుంటూ దేశ ప్రగతి కార్యక్రమాల్లో తోడ్పడాలని పిలుపునిచ్చారు.

యువత తమ సామర్థ్యాన్ని గుర్తించి, శ్రేష్ఠత కోసం కృషి చేయాలని కోరుతూ మంత్రి మాండవీయ ఇలా అన్నారు..."ఈ సమయం యువతదే. భారత యువత సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, వారి ఆకాంక్షల ఆధారంగానే వికసిత్ భారత్ రూపుదిద్దుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. 140 కోట్ల మంది భారత పౌరుల కలలను నిజం చేస్తూ ప్రపంచంతో పోటీపడే, ఆత్మవిశ్వాసం కలిగిన, ఆత్మనిర్భరత కలిగిన భారత్‌ను మనమందరం కలిసి నిర్మించాలి."

ఈ సదస్సును ఉద్దేశించి ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా మాట్లాడుతూ.. భారత యువత తమ అసాధారణ ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమతో దేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

దేశ నిర్మాణంలో యువత పోషిస్తున్న కీలక పాత్రను ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రస్తావించారు. భారతీయ యువత కష్టపడే తత్వం, గొప్ప దార్శనికత, సృజనాత్మకత, ధైర్యసాహసాలు కలిగినవారని కొనియాడారు. ఒక భారతీయ యువకుడు, యువతి సాధించే ప్రతి విజయం దేశాన్ని వికసిత్ భారత్ వైపు మరింత వేగంగా నడిపిస్తుందని తెలిపారు.

ఏ రంగంలోనైనా రాణించాలంటే పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. క్రీడలు, పారిశ్రామిక రంగం, కంటెంట్ క్రియేషన్, కళలు, ప్రజా సేవ వంటి వివిధ రంగాల్లో భారత యువత సాధిస్తున్న విజయాలను ఆమె ప్రశంసించారు.

యువ సమ్మేళనంలో ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే మాటాడుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ క్రియేటర్ ఎకానమీ అద్భుతమైన వృద్ధిని సాధించిందని కొనియాడారు. డిజిటల్ సాధికారత, సాంకేతిక ఆవిష్కరణల ద్వారా నేడు యువతకు అపారమైన అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు.

దేశంలో నూతన ఆవిష్కరణలను, పారిశ్రామిక స్ఫూర్తిని ప్రోత్సహిస్తూ, వ్యాపారానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా దేశాన్ని ప్రపంచానికే స్టార్టప్ రాజధానిగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రముఖ పారిశ్రామికవేత్త అమన్ గుప్తా ప్రశంసించారు.

క్రీడారంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచి, భారత క్రీడల పురోగతికి తోడ్పడిన ప్రముఖ క్రీడాకారులను ఈ సదస్సులో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా భారత క్రికెటర్ జితేష్ శర్మ 'ప్లే ఇన్ ఇండియా, ప్లే ఫర్ ఇండియా' (భారత్‌లో ఆడండి, భారత్ కోసం ఆడండి) అనే అంశంపై తన అనుభవాలను పంచుకున్నారు. క్రీడల్లో అత్యుత్తమంగా రాణించి, దేశ క్రీడా ఆకాంక్షలను నెరవేర్చాలని యువతను ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో యువజన వ్యవహారాల కార్యదర్శి శ్రీమతి పల్లవి జైన్ గోవిల్ కూడా పాల్గొని ప్రసంగించారు. దేశ నిర్మాణంలో యువత నిరంతరం భాగస్వాములు కావాలని కోరారు. యువ నాయకులను బలోపేతం చేయడానికి, వారికి తగిన సాధికారత కల్పించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే 2047 నాటికి.. భారత్‌ను అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధి కలిగిన, సమ్మిళిత దేశ నిర్మాణానికి చురుగ్గా తోడ్పడాలనే యువత నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ.. వికసిత్ భారత్ సంకల్పంతో మై భారత్ యువ సమ్మేళనం ముగిసింది.

# వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**-మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న**

అమరావతి, జూన్ 8:వార్డుల్లో ఉన్న సమస్యలను తోటి మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం అమీనాపురం వార్డు కార్యాలయంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేసముద్రం మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా అమీనాపురం వార్డును సందర్శించిన ఆమెను 5వ వార్డు కౌన్సిలర్ లింగాల రాజమణి శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా పంట మార్పిడి చేయాలని సూచించారు. ఒకే రకమైన పంటలను వరుసగా సాగు చేయడం వల్ల భూమి సారం తగ్గిపోతుందని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డు సమస్యను వినేందుకు, పరిష్కరించేందుకు మున్సిపాలిటీ సిద్ధంగా ఉందని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాస్ రావు, కౌన్సిలర్లు బానోత్ విజయ, లింగాల రాజమణి, బానోత్ అరుణ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, వైద్య శాఖ, పోలీస్ శాఖ, స్త్రీ?శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఆర్పీలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

# సూర్యప్రకాశ్ కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సహాయం

**-స్వయంగా ఇంటికి వెళ్లి అందజేసిన గద్దె క్రాంతి కుమార్**



విజయవాడ, జూన్ 8:ఇటీవల ఫుడ్ కోర్టులో జరిగిన విషాద ఘటనలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన 18వ డివిజన్‌కు చెందిన పందిటి సూర్యప్రకాశ్ కుటుంబ సభ్యులను సోమవారం గద్దె క్రాంతి కుమార్ రాణిగారితోటలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సూర్యప్రకాశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సూర్యప్రకాష్ తండ్రి మురళికి లక్ష రూపాయల నగదును అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన సూర్యప్రకాశ్ అకాల మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచనల మేరకు సొంత నిధుల నుంచి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, ప్రభుత్వం తరపున కూడా తగిన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబానికి పార్టీ తరపున, ప్రభుత్వం తరపున తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇటువంటి అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ జీవిత బీమా (ఇన్సూరెన్స్) తీసుకోవడం అవసరమని సూచించారు. ఇన్సూరెన్స్ ఉంటే ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు కొంతైనా అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొక్కెర తిరుపతయ్య, మైలామూరి ఫీరుబాబు, గొర్రిపర్తి నాగేశ్వరరావు, తలపాటి ప్రసాద్, పగడాల వెంకటేశ్వర రెడ్డి, బలగాని శ్రీను, గోగుల ఏసుబాబు, అంబటి కాశీ, అంబడిపూడి దుర్గమ్మ, రెడ్డి మాలక్ష్మమ్మ, గోగుల గోపి, పత్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# యువతను తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయకపోతే సమాజానికి చేటు

**-బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్**

అమరావతి, జూన్ 8:యువతను తల్లిదండ్రులు సరైన మార్గంలో నడిపించకపోతే వారు సమాజానికి చేటుగా మారే ప్రమాదం ఉందని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డు టేకులబస్తీలోని కేపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జరిగిన వార్డు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సభకు వార్డు కౌన్సిలర్ చింతల వసంత అధ్యక్షత వహించారు.





ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లలపై సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే కొందరు యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బెల్లంపల్లి పట్టణంలో యువతలో గంజాయి వినియోగం పెరుగుతోందని పేర్కొన్నారు. వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజల సహకారంతో గంజాయి నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రిటైర్డ్ సీబీసీఐడీ అడిషనల్ ఎస్పీ పులియాల రవికుమార్ మాట్లాడుతూ, యువతను క్రీడల వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. భవిష్యత్తులో బెల్లంపల్లిలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. వార్డు కౌన్సిలర్ చింతల వసంత మాట్లాడుతూ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ చైర్‌పర్సన్ దావస్వాతి సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఆడెపు పద్మ, మున్సిపల్ వార్డు అధికారులు అశోక్, రాజేందర్, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి కన్నూరి వెంకటేశ్వర్లు, టీపీసీసీ మీడియా సెల్ జిల్లా కోఆర్డినేటర్ దెవసాని ఆనంద్, ఆర్పీ శ్రీలత, సీనియర్ నాయకులు కన్నూరి రాజలింగు, కె. రాజరత్నం, చింతల బాలరాజు, యువజన నాయకులు బొల్లి వంశీ, చింతల లోకేశ్వర్, పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# నారా లోకేష్ విజన్‌తో ఏపీకి పారిశ్రామిక పునర్వైభవం..

**-నారా లోకేష్ విజన్‌తో ఏపీకి పారిశ్రామిక పునర్వైభవం..**
**-లోకేష్ చొరవతో ప్రపంచ దిగ్గజాల చూపు ఏపీ వైపు**
**-రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకకు కారణం పెట్టుబడిదారులకు కల్పించిన విశ్వాస వాతావరణం**
**-యువతకు ఉద్యోగాలు.. రాష్ట్రానికి పెట్టుబడులు**
**- లోకేష్ నాయకత్వంలో ఏపీకి కొత్త దిశ..**
**-ఎంపీ కేశినేని చిన్ని**
**-భవానిపురం లోని రాయల్ ఎన్ఫీల్డ్ షోరూమ్ ను సందర్శించిన ఎంపీ చిన్ని**

విజయవాడ జూన్ 8: విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానీపురంలో గల రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించారు. ఈ సందర్భంగా షోరూమ్ ఎండీ తేజ ఎంపీకి ఘన స్వాగతం పలికి, సంస్థ



కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై వివరించారు. షోరూమ్‌లోని అత్యాధునిక సదుపాయాలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలను ఎంపీ కేశినేని చిన్ని పరిశీలించి అభినందించారు. అనంతరం ఎంపీ చిన్ని మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడం రాష్ట్రంలో నెలకొన్న సానుకూల పారిశ్రామిక వాతావరణానికి నిదర్శనమన్నారు.

ఈ విశ్వాసాన్ని నెలకొల్పడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన లోకేష్, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, వేగవంతమైన అనుమతులు, పారదర్శక పరిపాలన, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దారని అన్నారు. గతంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాల వైపు వెళ్లిన పరిస్థితుల నుంచి నేడు ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌ను ఆశాజనక పెట్టుబడి కేంద్రంగా గుర్తించడం రాష్ట్రానికి గర్వకారణమని ఎంపీ తెలిపారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థల రాకతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు అనుబంధ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలోకి రావడం కేవలం ఒక సంస్థ రాక మాత్రమే కాదనీ,అది నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌పై పెరుగుతున్న పెట్టుబడిదారుల విశ్వాసానికి ప్రతీక అని మంత్రి లోకేష్ కృషిని కొనియాడారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయనీ, ఉద్యోగాలు వస్తే యువత భవిష్యత్తు బలపడుతుందని రాష్ట్ర అభివృద్ధికి ఇది శుభసూచకం అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాయల్ ఎంఫిల్డ్ షోరూమ్ సిబ్బంది తో ఎంపీ సెల్ఫీ వీడియో తీసుకున్నారు. అనంతరం సిబ్బంది తో ముచ్చటించారు ఈ కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు, వ్యాపార వర్గాల ప్రముఖులు, పార్టీ నాయకులు పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం నిలబడే నాయకులు కావాలి

**-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

కరీంనగర్, జూన్ 8:కార్యకర్తల కోసం, పార్టీ కోసం నిలబడి పోరాడే నాయకులే బీఆర్ఎస్ పార్టీకి కావాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అధికారం కోసమే వచ్చే నాయకులకు పార్టీలో స్థానం ఉండదని స్పష్టం చేశారు. సోమవారం ఎస్‌హెచ్ గార్డెన్‌లో ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు విస్తృత స్థాయి సమావేశం మరియు ఎస్ఐఆర్ ప్రక్రియపై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పార్టీ ఎప్పుడూ మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పని చేసే నాయకులను గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని, వాటికి భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ లీగల్ సెల్‌తో పాటు తాను కూడా అండగా ఉంటానని చెప్పారు. అధికారులు ప్రజల కోసం పనిచేయాలని, కానీ ధర్మపురి నియోజకవర్గంలో కొందరు పోలీసులు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు.

రాబోయే రెండున్నర సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధికారం కోసం పార్టీలు మారే నాయకులకు స్థానం ఉండదని, పార్టీ కోసం కష్టపడే వారికి మాత్రమే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరైనందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఐక్యరాజ్యసమితి 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్న మేజర్ అభిలాషా బరాక్‌కు అభినందనలు తెలిపిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 8:ఐక్యరాజ్యసమితి 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్న మేజర్ అభిలాషా బరాక్‌కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు అభినందనలు తెలియజేశారు. ప్రస్తుతం మేజర్ అభిలాషా బరాక్ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి తాత్కాలిక బలగాల (యూఎన్ఐఎఫ్ఐఎల్) విభాగంలో ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గా, జెండర్ ఫోకల్ పాయింట్‌గా సేవలందిస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఈ పురస్కారం ఆమె అసాధారణమైన సేవలకు లభించిన గుర్తింపుగా మాత్రమే కాకుండా ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ కార్యక్రమాలలో భారత్ సుదీర్ఘకాలంగా అందిస్తున్న విశేష సహకారానికి దక్కిన గౌరవమని ప్రధాని అభివర్ణించారు.దేశానికి, సమాజానికి, మానవాళికి సేవ చేయాలని ఆకాంక్షించే దేశంలోని లెక్కలేనంత మంది యువతీయువకులకు ముఖ్యంగా భారతమాత పుత్రికలకు ఆమె సాధించిన ఈ విజయం ఒక గొప్ప స్ఫూర్తి అని ఆయన కొనియాడారు."ఐక్యరాజ్యసమితి 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్న మేజర్ అభిలాషా బరాక్‌కు నా హృదయపూర్వక అభినందనలు. లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి తాత్కాలిక బలగాల (యూఎన్ఐఎఫ్ఐఎల్) విభాగంలో మేజర్ బరాక్ ప్రస్తుతం ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గా, జెండర్ ఫోకల్ పాయింట్‌గా సేవలందిస్తున్నారు.

# పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి సహాయాన్ని ప్రకటించిన ప్రధాని

న్యూ ఢిల్లీ, జూన్ 8:పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో జరిగిన ప్రమాదంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.

ఈ ప్రమాదంలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఆయన.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రధాని ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధాని ఈ విధంగా పేర్కొన్నారు:

"పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో జరిగిన ప్రమాదం గురించి తెలిసి తీవ్రగ్భ్రాంతికి లోనయ్యాను. ఈ ప్రమాదంలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తాం."

# సమస్యలు పరిష్కరించే ప్రభావశీల వేదికలు గ్రామ సభలు

## –డీఆర్డీఓ విద్యా చందన

నల్గొండ, జూన్ 8:ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపించే వేదికలుగా గ్రామ సభలు శాస్త్రీయ పద్ధతుల్లో జరగాలని, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం అర్హులైన వారికి చేరేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామ సభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా




ప్రభావశీలంగా ఉపయోగపడతాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్డీఓ విద్యా చందన అన్నారు. సోమవారం జూలూరుపాడు మండలం మాచినేని పేట తండాలో ప్రజా పాలన?ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీఓ విద్యా చందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు సాధ్యమవుతుందని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో డ్రైనేజీల శుభ్రత, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, వీధుల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజల భాగస్వామ్యం, రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు వంటి అంశాలపై ఆమె వివరించారు. పేదల అభివృద్ధి, సంక్షేమ పథకాలు హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. హాజరు కాని అధికారుల వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

మాచినేని పేట తండా సర్పంచ్ లకావత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో ఎపిడి రమణ, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎస్సై బాదావత్ రవి, ఎంపీఓ తులసీరామ్, ఎంఈఓ జూంకిలాల్, వెలుగు సీసీ బండ్ల మధు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మూడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ శకంలో సాధించిన అతి పెద్ద విజయం ఆలోచనాధోరణిలో వచ్చిన మార్పే: మంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 8:నరేంద్ర మోదీ ప్రభుత్వ పన్నెండేళ్ల పాలన భారతదేశాన్ని అవకాశాలు, ఆవిష్కరణలు, ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచే ఆకాంక్షాత్మక దేశంగా మార్చిందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పరిపాలన సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, పౌర కేంద్రక విధానాలు భారతీయులు తమ అవకాశాలను చూసే దృక్పథాన్ని ప్రాథమికంగా మార్చేశాయని మంత్రి స్పష్టం చేశారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా దేశం ముందుకెళుతున్న నేపథ్యంలో అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ తదుపరి దశ గురించి మంత్రి వివరించారు. ప్రస్తుతం 9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వచ్చే ఏడు నుంచి ఎనిమిదేళ్లలో 45 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుందని అంచనా వేశారు.

వరుసగా ఎన్నికైన ప్రధాన మంత్రిగా శ్రీ నరేంద్రమోదీ 4,399 రోజుల పదవీకాలం గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. గడచిన దశాబ్దంలో అనేక కొలవదగిన ఫలితాలు సాధించామన్నారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్ష రంగంలో వేళ్ల మీద లెక్కపెట్టేంత మాత్రమే అంకుర సంస్థలు ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 400కు చేరుకుందని అన్నారు. వాటిలో ఒక సంస్థ ఇటీవలే యూనికార్న్ హోదాను దక్కించుకుందని వెల్లడించారు. ప్రస్తుతం భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ సుమారుగా 9 బిలియన్ డాలర్లు కాగా వచ్చే ఏడు నుంచి ఎనిమిదేళ్లలో 45 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. దేశంలో అంకుర సంస్థలు 2014లో సుమారుగా 350 నుంచి 400 వరకు అంకుర సంస్థలు ఉంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 2.3 లక్షలకు పైగా చేరుకుందని మంత్రి అన్నారు. ఇవి దాదాపు 24-25 లక్షల ఉద్యోగాలను కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ అంకుర సంస్థల్లో దాదాపు సగం వరకూ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఉన్నాయి. 35-39 శాతం అంకుర సంస్థలకు మహిళలు నేతృత్వం వహిస్తున్నారు. ఇటీవలే జరిగిన అంతరిక్ష ప్రయోగంలో 1500 మంది మీడియా సిబ్బంది, దాదాపుగా 10,000 మంది ప్రేక్షకులు పాల్గొనడం.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తుందని మంత్రి అన్నారు.

పౌర కేంద్రిత పరిపాలనా నమూనా దిశగా వస్తున్న మార్పునకు ప్రతీకగా ప్రభుత్వం ఏర్పాటైన తొలి నాళ్లలో చేపట్టిన కొన్ని సంస్కరణలు నిలిచాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. డాక్యుమెంట్లపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ అవసరాన్ని తొలగించి స్వీయ ధ్రువీకరణకు అనుమతించాలనే నిర్ణయం.. పౌరులపై, ముఖ్యంగా యువతపై ఉన్న నమ్మకానికి సంకేతమన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వివిధ విభాగాల్లో ఇంటర్వ్యూలను రద్దు చేయడం గురించి కూడా మంత్రి ప్రస్తావించారు. ఇది బంధుప్రీతి, అధికారం, అవకతవకలకు అవకాశాన్ని తగ్గించడంతో పాటు, అర్హతల ఆధారిత ఎంపికలను బలోపేతం చేసిందన్నారు. పలుకుబడి లేదా సిఫార్సుల ద్వారా కాకుండా సామర్థ్యం, కష్టపడటం ద్వారా విజయం సాధించవచ్చనే విశ్వాసాన్ని పెంపొందించడానికి ఈ సంస్కరణలు దోహదపడ్డాయని మంత్రి తెలియజేశారు.

గత పన్నెండేళ్లలో విధానపరంగా మాత్రమే కాకుండా.. మానసికంగా కూడా మార్పు వచ్చిందనీ డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. భారతదేశంలో సరికొత్త ఆకాంక్షాత్మక సంస్కృతి ఆవిర్భవించిందని చెప్పారు. "12 ఏళ్ల ప్రధానమంత్రి మోదీ పాలనలో సాధించిన విజయాల్లో ఆలోచనా ధోరణిలో మార్పు ఒకటి అని ఆయన అన్నారు. "నేను కూడా ఇది చేయగలను అనే సంకల్పం గతంలో లేదు". సాంకేతికత, పారదర్శకత, నిష్పక్షపాతమైన పోటీ ద్వారా అందరికీ అవకాశాలను అందిస్తూ.. చిన్న పట్టణాలు, మెట్రోపాలిటన్ కాని నగరాల నుంచి పెరుగుతున్న సివిల్ సర్వీసు టాపర్ల సంఖ్యలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోందని మంత్రి అన్నారు.

ఈ విస్తృత పరివర్తనకు శాస్త్రీయ రంగంలో భారత్ సాధిస్తున్న విజయాలను సైతం మంత్రి అనుసంధానించారు. చంద్రయాన్ మిషన్ల గురించి ప్రస్తావించారు. దేశం సాధిస్తున్న శాస్త్రీయ విజయాల గురించి ప్రజలకు చేరువ చేసే, ఆవిష్కరణలను జాతీయ విజయాలుగా చూసే సంస్కృతిని ప్రభుత్వం ప్రోత్సహించిందని ఆయన అన్నారు. అపజయాలను ఎదుర్కొన్న సందర్భాల్లో శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి మోదీ అండగా నిలిచారనీ, వారి విజయాలను వేడుకగా నిర్వహించారనీ తద్వారా ఆవిష్కరణ, ప్రగతిలో అపజయం సాధారణమనే భావనను తీసుకురావడంలో సహాయపడ్డాయని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేసుకున్నారు. చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలో భారత్ విజయవంతంగా దిగడం సైన్స్ పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించిందనీ, భారత్ చేపట్టిన మిషన్లు చంద్రునిపై నీటి అణువుల జాడను గుర్తించడంలో సాయపడ్డాయనీ ఆయన అన్నారు.

సంస్థాగత మార్పుల గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరిస్తూ.. వ్యూహాత్మక రంగాలైన అంతరిక్షం, అణు రంగంలోని కొన్ని విభాగాల్లో ప్రైవేటు భాగస్వామ్యానికి మోదీ ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందనీ, దశాబ్దాల పాటు కొనసాగిన నియంత్రణకు ముగింపు పలికిందని తెలియజేశారు. ఈ రంగాలు ఒకప్పుడు రహస్యంగా కార్యకలాపాలు సాగించేవనీ, కానీ ఇప్పుడు పరిశ్రమలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలతో అనుసంధానమయ్యాయని ఆయన చెప్పారు. విధానపరమైన ఈ మార్పుల వల్ల ఉద్యోగావకాశాలు విస్తరించాయనీ, ఆవిష్కరణలు వేగవంతమయ్యాయనీ, ప్రపంచంలోని ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా భారతీయ సైంటిఫిక్ రంగం మారిందనీ మంత్రి తెలిపారు. దేశీయంగా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో భారత దేశం సాధించిన పురోగతిని సరిపోల్చుడానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని వికసిత్ భారత్ లాంటి కార్యక్రమాలు ప్రతిబింబి స్తున్నాయని కూడా ఆయన వివరించారు.

గ సార్వత్రిక వైన, పారదర్శకమైన అమలు దిశగా సంక్షేమ పథకాల పంపిణీ ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. గృహ నిర్మాణం, ఇతర సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ.. కులం, మతం, లేదా మరే ఇతర అంశాల ఆధారంగా వివక్షారహితంగా ప్రయోజనాలను అందిచడం వల్ల ప్రభుత్వ సంస్థలు, పాలనా వ్యవస్థలపై విశ్వాసం పెరిగిందన్నారు.

# 'జూలైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం'.. కేంద్రమంత్రి పీయూష్ గోయెల్

న్యూఢిల్లీ, జూన్ 8:సుదీర్ఘ కాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుకుంది. వచ్చే జూలైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరుదేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు.

దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తిస్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జూలై మధ్య నాటికి ఇరుదేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలుచేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు.

అయినప్పటికీ వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరుదేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే జూలై మధ్యకల్లా ఇరుదేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పాత ఓటర్ సెర్చ్ విధానాన్ని పునరుద్ధరించాలి

## - జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు చేయాలి

## - ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఎంఐఎం నేతల వినతి

కరీంనగర్, జూన్ 8:(నేటినిజం ప్రతినిధి) ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎంఐఎం కరీంనగర్ అధ్యక్షులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న ఎస్ ఐ ఆర్-2002 ఓటర్ సెర్చ్ పోర్టల్‌లో పేరు, ఇంటి నంబర్, ఎపిక్ నంబర్, పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ ఆధారంగా ఓటర్ల వివరాలను సులభంగా వెతికే అవకాశం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం కొత్త పోర్టల్‌లో ఈ ప్రాథమిక సెర్చ్ ఆప్షన్లు తొలగించడంతో ఓటర్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించి ప్రజల సందేహాల ను



నివృత్తి చేయడానికి రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే ఎస్ ఐ ఆర్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి జిల్లాలో ప్రత్యేక ఎస్ ఐ ఆర్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసి, ఫిర్యాదు లు, అభ్యర్థనలు, సాంకేతిక సమస్యలకు వెంటనే పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. పాత ఓటర్ సెర్చ్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ఎన్నికల అధికారులకు సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రెటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, మాజీ కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ మొహియుద్దీన్ బాబు జానీ, కంటేస్టేడ్ కార్పొరేటర్ అన్నెమల్ల సురేష్, ఖదీర్ శాఖాన్, రొండి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ 2047కు ప్రజా భాగస్వామ్యం, ఔత్సాహిక పారిశ్రామికరంగం, ఆవిష్కరణే ప్రధానం: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, జూన్ 8:ప్రజల భాగస్వామ్యం, ఆవిష్కరణ, ఔత్సాహిక పారిశ్రామిక రంగం, సమష్టి సంకల్పంతోనే వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాకారమవుతుందని లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం ప్రకాశ్ బిర్లా ఈ రోజు స్పష్టం చేశారు. 'మహేశ్వరీస్ అండ్ మేకింగ్ ఆఫ్ వికసిత్ భారత్ 2047' పేరుతో న్యూఢిల్లీలోని మహేశ్వరి సమాజం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఔత్సాహిక పారిశ్రామిక రంగం, జాతి నిర్మాణం కలసి పురోగతి సాధించాలని, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు భారత్ చేస్తున్న ప్రయాణం సమ్మిళిత వృద్ధి, సామాజిక బాధ్యత, క్రియాశీల పౌర భాగస్వామ్యం ద్వారా సాగాలని చెప్పారు.

భారత ఆర్థిక, సామాజిక రంగంలో ఓ చైతన్యవంతమైన శక్తిగా మహేశ్వరి సమాజాన్ని శ్రీ బిర్లా వర్ణించారు. సేవ, నైతిక విలువలతో కూడిన వ్యాపార పద్ధతులు, దాతృత్వం, సామాజిక బాధ్యత ద్వారా దేశ నిర్మాణానికి వారు చేసిన అమూల్యమైన కృషిని ప్రశంసించారు. విద్య, వైద్యం, ప్రజాసేవ కోసం వివిధ ప్రాంతాల్లో సంస్థలను స్థాపించడం, వాటిని నిర్వహించడం ద్వారా సామాజిక సంక్షేమం కోసం ఈ సమాజం నిరంతరం ప్రయత్నిస్తోందని ఆయన తెలియజేశారు.

పరిస్థితులకు అనుగుణంగా మారే తత్వాన్ని, వ్యాపార దక్షతను మహేశ్వరి సమాజం ప్రదర్శిస్తూ.. ప్రాంతీయ ఆర్థిక పరివర్తనలను ముందుకు నడిపించిందని లోక్ సభ స్పీకర్ అన్నారు. మెట్రోపాలిటన్ కేంద్రాలైనా, ఈశాన్య ప్రాంతమైనా లేదా దక్షిణ భారతమైనా.. ఈ సమాజానికి చెందిన వారు అవకాశాలను సృష్టించారు. ఉపాధిని కల్పించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేశారు. నిజాయతీ, నైతిక విలువలు, సామాజిక సామరస్యం పట్ల ఉన్న నిబద్ధతతో ఈ సమాజం.. వ్యాపార ప్రపంచంలో మార్గదర్శక ప్రమాణాలను నెలకొల్పింది.

సంపదను సృష్టించడం ఒక్కటే విజయానికి నిజమైన కొలమానం కాదనీ, విలువ, సానుకూల సామాజిక మార్పును తీసుకురావడమేనని శ్రీ బిర్లా చెప్పారు. శ్రీ ఆనంద్ రాఠీ సాధించిన పారిశ్రామిక విజయాలను ప్రశంసించారు. ఆయన మార్గదర్శక ప్రయాణం అనేక తరాల పాటు యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలియజేశారు. జస్టిస్ జేకే మహేశ్వరి చేసిన సేవలను కూడా ఆయన ప్రశంసించారు. న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలోనూ, న్యాయ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడంలోనూ ఆయన చేసిన కృషి.. కీలక పాత్రను పోషించిందని తెలియజేశారు. ఇలాంటి విశిష్ట వ్యక్తులు సమాజంలోని ఉత్కృష్టత, నాయకత్వం, ప్రజాసేవ అనే గొప్ప సంప్రదాయాలను ప్రతిబింబిస్తారని వివరించారు.

భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పోషించే పాత్రను శ్రీ బిర్లా వివరించారు. వికసిత్ భారత్ - 2047 లక్ష్యానికి విద్యావంతులైన, నైపుణ్యాలున్న, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువతే అతి పెద్ద బలం అని ఆయన అన్నారు. ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలబెట్టేందుకు ఆవిష్కరణలనూ, కృత్రిమ మేధనూ, నూతనంగా ఆవిర్భవిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాలనూ యువత స్వీకరించాలని ఆయన కోరారు. రాబోయే యుగం విజ్ఞానం, ఆవిష్కరణలతోనే ముందుకు సాగుతుందని ఆయన చెప్పారు. ఉద్యోగాలను అన్వేషించేవారిగా కాకుండా.. ఉద్యోగాలను కల్పించే వారిగా యువత మారాలని పిలుపునిచ్చారు.

గత దశాబ్దంలో భారత్ సాధించిన పురోగతి దేశ స్థిరత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించిందనీ స్పీకర్ చెప్పారు. హక్కులను బాధ్యతలతో సమతుల్యం చేసుకోవాల్సిన ప్రాధాన్యాన్ని ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధిని కొనసాగించడానికి బాధ్యతాయుతమైన పౌరసత్వం, వ్యవస్థల పట్ల గౌరవం, ప్రజాజీవితంలో చురుకైన భాగస్వామ్యం అవసరమని స్పీకర్ స్పష్టం చేశారు. పార్లమెంటు, ప్రజాస్వామ్య సంస్థల ద్వారా చేపట్టిన శాసన సంస్కరణలు పారదర్శకతను గణనీయమైన రీతిలో పెంచాయనీ, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరిచాయనీ ఆయన తెలియజేశారు.

ఐక్యతా స్ఫూర్తి, సేవ, వ్యాపారం, 'దేశమే ముందు' అనే సూత్రం ద్వారా వికసిత్ భారత్ - 2047 లక్ష్యాన్ని దేశం సాధించగలదనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ శ్రీ బిర్లా తన ప్రసంగాన్ని ముగించారు. ఆవిష్కరణలు, నైతిక విలువలతో కూడిన నాయకత్వం, సామాజిక నిబద్ధత ద్వారా దేశాభివృద్ధికి దోహదపడాలని మహేశ్వరి సమాజానికి ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు. ప్రగతిలో ప్రతి పౌరుడూ చురుగ్గా పాల్గొన్నప్పుడే, సామాజిక బాధ్యత, సామూహిక సంక్షేమంతో కలసి ఆర్థిక వృద్ధి కలసి నడిచినప్పుడే అభివృద్ధి చెందిన భారత్ నిర్మితమవుతుందని శ్రీ బిర్లా స్పష్టం చేశారు.

# జార్ఖండ్ నుంచి యునైటెడ్ కింగ్‌డమ్‌కు తొలిసారి తాజా మామిడి ఎగుమతి సౌలభ్యం కల్పించిన 'అపెడా'

న్యూఢిల్లీ, జూన్ 8:జార్ఖండ్ నుంచి యునైటెడ్ కింగ్‌డమ్‌కు తాజా మామిడి పండ్ల తొలి వాణిజ్య ఎగుమతి ప్రారంభమైంది. ఈ నెల 4వ తేదీన కోల్‌కతాలో మొదలైన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రం నుంచి వ్యవసాయ ఎగుమతులలో ఓ కీలక పరిణామంగా పరిగణించవచ్చు. కేంద్ర వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'వ్యవసాయ-ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ' (అపెడా) ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఎగుమతి అయిన ఈ సరకులో జార్ఖండ్‌లోని సిమ్‌డేగా జిల్లా, బానో సమితి పరిధిలో పూర్తిగా మహిళల సారథ్యంలోగల రైతు ఉత్పత్తిదారు సంస్థ (ఎఫ్‌పీసీ) 'బేయురా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' 1.5 టన్నుల తాజా 'ఆమ్రపాలి' రకం మామిడి పండ్లు కూడా ఉన్నాయి. ఈ సరకును 'మెస్సర్స్ జేజీబీ ఆగ్రోఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్' లండన్‌కు ఎగుమతి చేసింది.

సిమ్డేగా జిల్లాలోగల రైతు ఉత్పత్తిదారు కంపెనీలు (ఎఫ్‌పీసీ), రైతు ఉత్పత్తిదారు సంఘాలు (ఎఫ్‌పీఓ), ప్రగతిశీల రైతుల కోసం 'అపెడా' 2026 మే 5న నిర్వహించిన ఎగుమతి-ఆధారిత సామర్థ్య వికాస కార్యక్రమానికి అనుగుణంగా ఈ ఎగుమతి కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఎగుమతి అవసరాలు, నాణ్యత ప్రమాణాలు, మార్కెట్ అవకాశాలపై అపెడా దృష్టి సారించింది.

అనంతరం జిల్లా నుంచి ఎగుమతి నాణ్యతతో కూడిన మామిడి పండ్ల సేకరణ కోసం 'బేయురా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్', 'మెస్సర్స్ జేజీబీ ఆగ్రోఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్' మధ్య అనుసంధానానికి 'అపెడా' సౌలభ్యం కల్పించింది. ప్రస్తుత సరకు రవాణా లావాదేవీ ఈ సంధానం ఫలితమే.

ఎగుమతి విలువ వ్యవస్థలో 'ఎఫ్‌పీసీ' ప్రత్యక్ష పాత్రకు ఈ అనుసంధానం వీలు కల్పించింది. దీంతోపాటు తన సభ్యులైన రైతులకు మార్కెట్ లభ్యత కూడా ఏర్పరచింది. తద్వారా ఈ 'ఎఫ్‌పీసీ'తో ముడిపడిన రైతులు ప్రస్తుత దేశీయ మార్కెట్ ధరతో పోలిస్తే తమ ఉత్పత్తులకు అధిక ధర పొందగలిగారు.

ఈ ప్రాంతంలోని రైతులు నాణ్యమైన ఉత్పత్తి పద్ధతులను అనుసరించేలా చేయడంతోపాటు పంట కోత అనంతర నిర్వహణ మెరుగుదల, అంతర్జాతీయ ప్రమాణాల పాటింపు దిశగా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.

జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగుకు అనుకూలమైన వ్యవసాయ-వాతావరణ పరిస్థితులున్నాయి. అందువల్ల ఇక్కడ సాగుచేసే 'ఆమ్రపాలి' రకం మామిడికి మార్కెట్‌లో విశేష గిరాకీతోపాటు నాణ్యత లక్షణాల పరంగానూ ప్రాచుర్యం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత లావాదేవీ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లకు తాజా పండ్లను ఎగుమతి చేసే రాష్ట్రాల జాబితాలో జార్ఖండ్ కూడా స్థానం సంపాదించింది.

మార్కెట్ అభివృద్ధి, సామర్థ్య వికాసం కార్యక్రమాలతోపాటు నాణ్యత మెరుగుదల చర్యలు, భౌగోళిక నిర్ధారణ వ్యవస్థలు, ఎగుమతి ప్రోత్సాహక కార్యకలాపాల ద్వారా వ్యవసాయ-ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు 'అపెడా' అన్ని విధాలుగా సౌలభ్యం కల్పిస్తోంది. ఈ దిశగా మహిళల సారథ్యంలోని సంస్థలు, గిరిజన ఉత్పత్తిదారు సంస్థలు సహా రైతు సంఘాల భాగస్వామ్యానికీ మద్దతిస్తోంది.

ఈ నేపథ్యంలో జార్ఖండ్‌లోని రైతు ఉత్పత్తిదారు సంస్థలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించే దిశగా రాష్ట్రం నుంచి తాజా మామిడి పండ్ల తొలి వాణిజ్య ఎగుమతిని ఓ కీలక మలుపుగా పరిగణించవచ్చునని 'అపెడా' పేర్కొంది.

# జాతీయ ఇ-గవర్నెన్స్ అవార్డులు-2026లో ఇ-జాగృతికి రజత పురస్కారం

న్యూఢిల్లీ, జూన్ 8:విని యోగదారు వ్యవహారాల శాఖ పరిధిలోని ఇ-జాగృతి వేదికకు జాతీయ ఇ-గవర్నెన్స్ అవార్డు లు-2026లో రజత పురస్కారం లభించింది. పాలన సంస్కరణలు, ప్రజా సమస్యల పరిష్కార విభాగం ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ ఇ-గవర్నెన్స్ పురస్కారాలను ప్రదానం చేస్తుంది. ఈ నేపథ్యంలో డిజిటల్ రూపాంతరీకరణ దిశగా సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో కేటగిరీ-ఎ ప్రభుత్వ ప్రక్రియల పునర్వ్యవస్థీకరణ కింద ఇ-జాగృతి వేదిక ఈ బహుమతిని కైవసం చేసుకుంది. కేంద్ర మంత్రిత్వ శాఖలు-విభాగాలు సహా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిన మొత్తం 341 ప్రతిపాదనలపై కఠిన మూల్యాంకన ప్రక్రియ అనంతరం ఇ-జాగృతికి ఈ గుర్తింపు లభించింది. సాంకేతికత ఆధారిత, పౌర-కేంద్రక సేవల ద్వారా వినియోగదారు ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో రూపాంతరీకరణ దిశగా మార్పు తేవడంలో ఇ-జాగృతి పాత్రను ఈ పురస్కారం పునరుద్ఘాటిస్తోంది. ఇ-జాగృతి 2025 జనవరి 1న ప్రారంభమయ్యాక 'ఓసీ ఎంఎస్, ఇ-దాఖిల్, 'ఎన్ సీడీ ఆర్‌సీ సీఎంఎస్' కన్ఫోనెట్ అనే 4 పాత అనువర్తనాలను 'ఏఐ సమర్థ' కాగిత రహిత వేదికగా ఏకీకృతం చేసింది. దీనికి శ్రీకారం చుట్టిన నాటి నుంచి దాఖలైన 2.29 లక్షలకు పైగా వినియోగదారు కేసులకుగాను 2.07 లక్షలకు పైగా కేసుల పరిష్కారానికి ఈ వేదిక వీలు కల్పించింది. తద్వారా 90.75 శాతం కేసులను పరిష్కరించగలిగింది.

# "ఎన్‌జడ్‌పీ సాథీ యాప్"ని, నేషనల్ జూలాజికల్ పార్కులో సెల్ఫ్-టికెటింగ్ కియోస్కులను ప్రారంభించిన పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి



న్యూ ఢిల్లీ, జూన్ 8:న్యూఢిల్లీలోని నేషనల్ జూలాజికల్ పార్క్ (ఎన్‌జడ్‌పీ)లో "ఎన్‌జడ్‌పీ సాథీ యాప్"ను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ ఈ రోజు ప్రవేశపెట్టారు. సెల్ఫ్-టికెటింగ్ కియోస్కులను కూడా ఆయన ప్రారంభించారు. స్మార్ట్ నావిగేషన్‌తో సందర్శకులకు మెరుగైన అనుభూతులను పంచడమే కాకుండా, ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగును సరళతరం చేయాలనేదే ఈ నూతన సేవల లక్ష్యం.

ఇటీవల ముగిసిన ఎండాకాలం సెలవుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన సృజనాత్మక కళాకృతులతో ఓ ప్రదర్శనను ఏర్పాటు చేయగా, ఆ ప్రదర్శనను మంత్రి చూశారు. యువ ప్రతిభావంతుల సృజనను ఆయన ప్రశంసించారు. వన్యప్రాణి సంరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహనను పెంచే దిశగా విద్యా, చైతన్య ప్రధాన కార్యక్రమాల్ని నిర్వహించినందుకు జంతు ప్రదర్శనశాల అధికారులను మంత్రి అభినందించారు.

మంత్రి "ఎన్‌జడ్‌పీ సాథీ యాప్"ను లాంఛనప్రాయంగా ప్రవేశపెట్టారు. సెల్ఫ్-టికెటింగ్ కియోస్కులను కూడా ఆయన ప్రారంభించారు. ఇవి నేషనల్ జూలాజికల్ పార్కులో సందర్శకులకు సౌకర్యాలను కల్పించడంతో పాటు డిజిటల్ పరివర్తన దిశగా చేపట్టిన ఒక ముఖ్య చర్యకు సూచికగా నిలిచాయి.

"ఎన్‌జడ్‌పీ సాథీ యాప్" ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫారాల్లో అందుబాటులోకి వచ్చింది. దీనిలో ఒక ఇంటరాక్టివ్ డిజిటల్ మ్యాపుతో పాటు స్మార్ట్ నావిగేషన్ సిస్టమ్ కూడా ఉంది. ఇవి సందర్శకులకు జంతువుల నిలయాలు, వాష్‌రూములు, బగ్గీ పాయింట్లు, నిష్క్రమణ తదితర సౌకర్యాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్న సమాచారాన్ని అందిస్తాయి. ఈ యాప్.. ఎక్స్‌ప్రెస్ టూర్, ఫ్యామిలీ టూర్, గ్రాండ్ జూ టూర్‌లతో పాటు వ్యక్తిగతమైన అనుభూతినిచ్చే "మై టూర్" ఐచ్ఛికాలను కూడా అందిస్తుంది.

సెల్ఫ్-టికెటింగ్ కియోస్క్ యూపీఐ ఆధారంగా పనిచేస్తుంది. డిజిటల్ చెల్లింపు మాధ్యమం ద్వారా ఆన్‌లైన్ టికెట్ బుకింగు సౌకర్యాన్నీ అందిస్తుంది. అప్పటికప్పుడు టికెటును బుక్ చేసుకోవడానికి అనువుగా ఉచిత వై-ఫై సంధాన సదుపాయాన్ని దీనిలో ఉంచారు.

అధికారులతోనూ, సెక్షన్ ఇంచార్జులతోనూ మంత్రి ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, నేషనల్ జూలాజికల్ పార్కులో సమగ్ర సంస్కరణలు, ఆధునికీకరణ ప్రధాన కార్యక్రమాలు, సమర్థ నిర్వహణకు అవలంబించాల్సిన వ్యూహాలను చర్చించారు.

పక్షుల ఆవాసాలను మంత్రి పరిశీలించారు. వేసవిలో పక్షుల సంరక్షణకు ఏయే ఏర్పాట్లను చేసిందీ అడిగి తెలుసుకున్నారు. కంచెల స్థితి ఎలా ఉందీ గమనించారు. జంతు సంక్షేమం, ఆవాసాల నిర్వహణ అంశాలలో మరింత మెరుగుదల దిశగా కొన్ని సూచనలను చేశారు.

పశువుల చికిత్సకు ఏర్పాటు చేసిన వైద్యశాలను మంత్రి సందర్శించారు. జబ్బుపడిన పశువులను సంరక్షించే దిశగా అక్కడ చేపడుతున్న చర్యలపై, ఆసుపత్రి నిర్వహణ తీరుతెన్నులపై పశు ఆరోగ్య సిబ్బందితో మంత్రి విస్తృతంగా చర్చించారు.

ఆ తరువాత, సింహాల ఎన్‌క్లోజరును మంత్రి సందర్శించారు. ఏషియాటిక్ పులులు 'కార్తీక్', 'కరణీ'లను ఆయన చూశారు. వాటి సంరక్షణ, ఎన్‌క్లోజర్ సమగ్ర నిర్వహణ విధానాన్ని గురించి సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకొని, సంతృప్తిని వ్యక్తం చేశారు.

వన్యప్రాణుల సంరక్షణ, సంక్షేమం, సందర్శకులకు తెలియజేయాల్సిన అంశాల్లో నేషనల్ జూలాజికల్ పార్కు సిబ్బంది, అధికారులు కనబరుస్తున్న చిత్తశుద్ధిని, అంకిత భావాన్ని, నిరంతర ప్రయత్నాల్ని మంత్రి ప్రశంసించారు.

నేషనల్ జూలాజికల్ పార్కు యంత్రాంగం సంరక్షణకు సంబంధించిన విద్యను పటిష్ఠపరచడానికి, సాంకేతికతను ఉపయోగించుకుంటూ సందర్శకుల సేవలను మెరుగుపరచడానికి, పశు సంరక్షణ, నిర్వహణలలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడానికి కట్టుబడి ఉంది.

## శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్-2026 టైటిల్ గెలిచిన భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకి కేంద్రమంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 8:శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్-2026 టైటిల్ గెలిచిన భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

భారతదేశ కుమార్తెలు చరిత్ర సృష్టించారని సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో కేంద్రమంత్రి కొనియాడారు. శాఫ్ మహిళల ఛాంపియన్‌షిప్-2026 గెలిచిన మహిళల ఫుట్‌బాల్ జట్టు యావత్ దేశం గర్వించేలా చేసిందన్నారు. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాటలు లక్షలాది మంది యువ క్రీడాకారులకు, భరతమాత పుత్రికలకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ విజయం నారీ శక్తికి, అంకితభావానికి, నవభారత ఆత్మవిశ్వాసానికి ప్రతీకని పేర్కొన్నారు.జట్టు సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, వారి ఉజ్వల భవిష్యత్తుకు కేంద్రమంత్రి శుభాకాంక్షలు చెప్పారు.

# మృగశిర కార్తె.. జోరుగా చేపల విక్రయాలు



మెదక్, జూన్ 8:రుతుపవనాల ప్రారంభాన్ని, వేసవి గరిష్ట ఉష్ణోగ్రతల తగ్గుదలను, వ్యవసాయ చక్రం మొదలును సూచించే సాంప్రదాయక కార్యక్రమం మృగ శిర కార్తె. ఈ కాలంలో చేపలు, సముద్రపు ఆహారం తినేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారని తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో మృగశిర కార్తె రోజున చేపలు తినడం వల్ల శ్వాసకోశ సంబంధిత రుగ్మతలు తగ్గుతాయని, అదే విధంగా రుతు మార్పులకు శరీరం సన్నద్ధమవుతుందని భావిస్తారు.తెలుగు వార్తలుకాగా మృగ శిర కార్తెను పురస్కరించుకొని మెదక్ ,హవేలి ఘన్‌పూర్ మండలాలలో మండల కేంద్రంతో పాటు కొముటూర్, మంబోజి పల్లి, బ్యాతోల్ తిమ్మాయిపల్లి, పరిసర గ్రామాల్లో చెరువుల వద్ద చేపల కొనుగోళ్ళు జోరందుకున్నాయి. కార్తె తొలి రోజున చేపలు తినడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ కావడం వల్ల, స్థానిక చేపల మార్కెట్లు, తాత్కాలిక విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.

ఈ సందర్భంగా మార్కెట్లలో ఉదయం నుంచే సందడి వాతావరణం నెలకొంది. చెరువుల నుండి సేకరించిన తాజా రొహు, బొచ్చె (కట్ల) వంటి వివిధ రకాల చేపలను పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు : ఎమ్మెల్యే కూనంనేని

## -ఇందిరమ్మ ఇళ్ల కోసం కూనంనేనిని కలిసిన ఎస్ఆర్‌టీ ఏరియా పరిరక్షణ కమిటీ

ఖమ్మం, జూన్ 8: తమ ఇళ్లను కూల్చివేసి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్లు గానీ, సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా గానీ ఎలాంటి సహాయం అందలేదని పేర్కొంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సోమవారం రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఎస్ఆర్‌టీఏ ఏరియా పరిరక్షణ కమిటీ సభ్యులు కలిసి తమ సమస్యలను వివరించారు. రుద్రంపూర్ సీపీఐ కార్యదర్శి, ఉప సర్పంచ్ తోటరాజు, సలిగంటి శ్రీనివాస్, గనిగళ్ల వీరస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. నివాసానికి ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమకు కేటాయించిన స్థలాల అభివృద్ధి కూడా జరగలేదని పేర్కొన్నారు. తామంతా నిరుపేదలమని, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులమని చెబుతూ కనీసం రెండో విడతలోనైనా ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అర్హులైన వారందరికీ మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు రావాల్సి ఉందని, కొన్ని కారణాల వల్ల ఆలస్యం జరిగిందని తెలిపారు. వెంటనే సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఇందిరమ్మ ఇళ్లు రాని వారికి సీఎస్ఆర్ నిధుల ద్వారా సహాయం అందించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో కూడా చర్చిస్తానని హామీ ఇచ్చారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు ఉన్న ప్రతి అర్హుడికి తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. దీంతో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# మత్స్య సంపద విలువ వ్యవస్థల బలోపేతం... ప్రపంచ సముద్ర ఆహార ఉత్పత్తుల మార్కెట్లో భారత పోటీని పెంపొందించడంపై విశాఖపట్నంలో జాతీయ సదస్సు

న్యూఢిల్లీ, జూన్ 8:సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై 2026 జూన్ 5, 6 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జాతీయ సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖతో కలిసి మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన మత్స్య విభాగం ఈ సదస్సును నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ చిరాగ్ పాశ్వాన్ మొదటి రోజు సదస్సులో పాల్గొన్నారు.

ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపీఈడిఏ), ఎగుమతుల తనిఖీ మండలి (ఈఐసీ), భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ ఎస్ఎస్ఏఐ), జాతీయ మత్స్య పరిశ్రమాభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్డీబీ) నాబార్డ్, ఎన్‌సీడీసీ, ఎన్‌సీఈఎల్, ఎస్ఎఫ్ఏసీ, ఇన్వెస్ట్ ఇండియా వంటి ప్రముఖ జాతీయ సంస్థలు ఈ సదస్సులో భాగస్వామ్యమయ్యాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల రంగానికి పూర్తిస్థాయి ప్రాతినిధ్యం కల్పించేలా వాటి ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలు, ప్రాసెసర్లు, స్టార్టప్‌లు, ఇతర అనుబంధ రంగాలకు చెందినవారు కూడా సదస్సుకు హాజరయ్యారు.

భారత్ ను ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం గల సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతి దేశంగా నిలబెట్టడంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. కేవలం పరిమాణం ఆధారిత ఎగుమతుల నుంచి విలువ ఆధారిత, అత్యున్నత నాణ్యమైన ఉత్పత్తుల వైపు మారడం, భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండ్‌ను బలోపేతం చేసేందుకు ఆవిష్కరణలు, అధునాతన సాంకేతికతలు, మూలాలను గుర్తించే పటిష్ఠమైన వ్యవస్థలను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలను చర్చించారు. సమర్థవంతమైన, నిబంధనలకు అనుగుణమైన వాణిజ్యం కోసం కోల్డ్ చైన్, ఎయిర్ కార్గో, క్వారంటైన్ వసతులతో సహా ఎగుమతి మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలను విస్తరించాల్సిన అవసరాన్ని కూడా ఈ చర్చల్లో ప్రముఖంగా ప్రస్తావించారు.

ఉత్పత్తిలో గణనీయమైన వాటా కలిగిన మత్స్య సంపద (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్) ఎగుమతులను పెంచాల్సిన అవసరాన్ని, తినేందుకు సిద్ధంగా ఉండే (రెడీ-టు-ఈట్) ఉత్పత్తులు, అధిక విలువ కలిగిన చేపల జాతులు వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఇంకా వినియోగంలోకి రాని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

సుస్థిరత, నాణ్యత హామీ, నియంత్రణ నిబంధనల పాటింపుతో పాటు ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని, విలువ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రులు ప్రస్తావించారు. సముద్ర ఆహార ఎగుమతుల రంగాన్ని మరింత పటిష్ఠంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రభుత్వ విధానం అవలంబించడం, బహుళ రవాణా వ్యవస్థలను మెరుగుపరచడం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

మత్స్య శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సాగర్ మెహ్రా ప్రస్తుత సంస్కరణలు, ప్రాధాన్యతా పథకాల ద్వారా ఉత్పత్తిని పెంచడం, మూలాల గుర్తింపు, ధృవీకరణ వ్యవస్థలను బలోపేతం చేయడం, సముద్ర లోతు, ఈఈజెడ్ వనరులలోని అపారమైన సామర్థ్యాన్ని వెలికితీయడం వంటి అంశాలపై ప్రసంగించారు. వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ అజయ్ భదూ భారత ఎగుమతుల నిర్వహణ, మారుతున్న ప్రపంచ మార్కెట్ పోకడలు, సముద్ర ఆహార ఎగుమతుల విస్తరణలో ఎఫ్‌టీఏల పాత్ర, మార్కెట్ వైవిధ్యీకరణ, మెరుగైన పోటీతత్వం గురించి వివరించారు. ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ డి. ప్రవీణ్, ప్రపంచ ప్రమాణాలతో పోల్చితే మనకున్న లోపాలను గుర్తిస్తూ, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులను పెంచాల్సిన అవసరాన్ని ప్రముఖంగా చెప్పారు. ఎగుమతి విలువను పెంచేందుకు కోల్డ్ చైన్ అభివృద్ధి, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలు, గొలుసుకట్టు వ్యవస్థల అనుసంధానానికి మద్దతు ఇచ్చే కీలక పథకాలను ఆయన ప్రస్తావించారు.

మధ్యప్రదేశ్ ప్రభుత్వ మత్స్య శాఖ కార్యదర్శి శ్రీ స్వతంత్ర కుమార్ సింగ్ రైతుల ఆదాయం, ఉత్పత్తిని పెంచడానికి కేజ్ కల్చర్, జలాశయాల ఆధారిత జలచరాల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ముత్యాల పెంపకం వంటి అత్యంత లాభదాయకమైన ప్రక్రియల వైపు మళ్లడం ద్వారా లోతట్టు జల్ జల మత్స్య సంపద ఎగుమతి సామర్థ్యాన్ని పెంచవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఎగుమతుల తనిఖీ కౌన్సిల్ అధికారులు మార్కెట్ పరిధిని విస్తరించడానికి ధృవీకరణ, తనిఖీ వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు పటిష్ఠమైన నాణ్యతా ప్రమాణాలు, రసాయన అవశేషాల నియంత్రణ, యాంటీమైక్రోబియల్ ప్రమాణాలు, డిజిటల్ పద్ధతిలో మూలాల గుర్తింపు వంటి అంతర్జాతీయ నిబంధనలను అమలు చేయాల్సిన ప్రాధాన్యతను వివరించారు. పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ)తో పాటు సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏఐ), ఇండియన్ ఫిష్‌మీల్ అండ్ ఫిష్ ఆయిల్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఏఎఫ్ఈఏ), ఇండియన్ మెరైన్ ఇంగ్రెడియెంట్స్ అసోసియేషన్ (ఐఎంఐఏ) మొదలైన పరిశ్రమల సంఘాలు మార్కెట్ అవకాశాలు, పోటీతత్వం, సుస్థిరత, సముద్ర ఆహార సీఫుడ్ ఎగుమతులను ప్రభావితం చేసే కీలక సవాళ్లపై భాగస్వాముల అభిప్రాయాలను పంచుకున్నాయి.

ఈ చర్చల్లో సముద్ర ఆహార ఎగుమతి విలువ వ్యవస్థల సరఫరా వ్యవస్థలో... వ్యాధుల నిర్వహణ, పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలు, నాణ్యమైన విత్తనాలు (చేప/రొయ్య పిల్లలు), క్వారంటైన్ వసతులు సరిగ్గా లభించకపోవడం, రవాణా, కోల్డ్ చైన్, ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలలో లోపాలు వంటి కీలక సవాళ్లను వాటాదారులు ప్రముఖంగా ప్రస్తావించారు. కఠినమైన ధ్రువీకరణ నిబంధనలు, యాంటీబయాటిక్ ఔషధాలపై నియంత్రణలు, మూలాల గుర్తింపు)తో పాటు లోతట్టు జల మత్స్య సంపద నుంచి ఎగుమతుల వాటా తక్కువగా ఉండటంపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అత్యంత విలువైన రకాలు, కొత్త మార్కెట్ల వైపు విస్తరించాల్సిన అవసరాన్ని కూడా గుర్తుచేశారు.

2026 జూన్ 6వ తేదీన జరిగిన రెండో రోజు సదస్సులో రెండు ప్రత్యేక సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. సముద్ర ఆహార ఎగుమతుల్లో లక్ష కోట్ల రూపాయల స్థాయిని అధిగమించాలనే జాతీయ లక్ష్యానికి మద్దతుగా, భారత సముద్ర ఆహార ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన వ్యూహాత్మక చర్యలపై ఇందులో ప్రధానంగా దృష్టి పెట్టారు. మత్స్య రంగంలో ధృవీకరణలు, మూలాల గుర్తింపు, విలువ ఆధారిత ఉత్పత్తులు, సుస్థిరత, సరికొత్త ఎగుమతి అవకాశాలకు సంబంధించిన అంశాలపై చర్చించడానికి విధానకర్తలు, ఎగుమతిదారులు, పరిశ్రమల ప్రముఖులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, ఇతర వాటాదారులు ఈ సమావేశాల్లో ఒకచోటికి చేరారు.

విలువ జోడింపు, ధ్రువీకరణ, విలువ మూలాల గుర్తింపు ద్వారా సముద్ర ఆహార ఎగుమతులకు ప్రోత్సాహం అనే అంశంపై నిర్వహించిన తొలి సాంకేతిక సమావేశానికి ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డీ వీ స్వామి అధ్యక్షత వహించారు. ఎంపెడా ఛైర్మన్ పీ జవహర్, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సహాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో భారత సముద్ర ఆహార ఎగుమతుల పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తూ మూడు ప్రధాన అంశాలపై చర్చలు జరిగాయి. అవి: (ఐ) ఎగుమతి మార్కెట్ల కోసం చేపల వేట ధ్రువీకరణకు తోడ్పడే గుర్తింపు వ్యవస్థలు. (ఐఐ) ఆక్వాకల్చర్, చేపల వేట రంగాల్లో సుస్థిర ధ్రువీకరణ. (ఐఐఐ) సముద్ర ఆహార రంగానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ)విధాన రూపకల్పన అవకాశాల పరిశీలన.

మారుతున్న అంతర్జాతీయ మార్కెట్ నిబంధనలను, ముఖ్యంగా ప్రధాన ఎగుమతి దేశాల వేటాడిన మత్స్య సంపద ధ్రువీకరణ ప్రమాణాలను అందుకోవడానికి ఆక్వాకల్చర్, సముద్ర మత్స్య రంగాలు రెండింటిలోనూ మూలాల గుర్తింపు వ్యవస్థల ప్రాధాన్యత పెరుగుతోందని ఈ చర్చలు స్పష్టం చేశాయి. పారదర్శకత, నిబంధనల అమలు, మార్కెట్ పరిధిని మెరుగుపరచడానికి పటిష్ఠమైన డిజిటల్ గుర్తింపు వ్యవస్థలు, వాటాదారుల మధ్య మెరుగైన సమన్వయం, విలువ వ్యవస్థ అంతటా మరింత అనుసంధానం అవసరమని చర్చల్లో స్పష్టం చేశారు. మార్కెట్ పరిధిని విస్తరించడానికి, వినియోగదారుల నమ్మకాన్ని పెంపొందించడానికి అవసరమైన సుస్థిర ధృవీకరణ విధానాలు, బాధ్యతాయుతమైన ఉత్పత్తి పద్ధతులను కూడా ఈ సదస్సులో పరిశీలించారు. భారతీయ ధృవీకరణ వ్యవస్థలను ప్రోత్సహించడం, సుస్థిరత చర్యలను బలోపేతం చేయడం, భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల అంతర్జాతీయ పోటీతత్వాన్ని పెంచడంపై ప్రతినిధులు చర్చించారు. సముద్ర ఆహార రంగం కోసం ప్రతిపాదిత పీఎల్ఐ విధానంపై జరిగిన చర్చలు ప్రధానంగా విలువ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడం, ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వడం, పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి పెట్టాయి. నిర్దేశిత విధానపరమైన మద్దతు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రపంచ సముద్ర ఆహార విలువ వ్యవస్థలలో భారత్ స్థానాన్ని బలోపేతం చేయడంపై కూడా ఈ చర్చల్లో ప్రముఖంగా ప్రస్తావించారు.

"సముద్ర ఆహార ఎగుమతుల పురోగతిలో మత్స్య, ఆక్వాకల్చర్ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈల పాత్ర" అనే అంశంపై జరిగిన రెండవ సాంకేతిక సమావేశానికి కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ మత్స్య విభాగం సంయుక్త కార్యదర్శి (లోతట్టు జల మత్స్య సంపద) శ్రీ సాగర్ మెహ్రా, ఐసీఏఆర్ డీడీజీ (మత్స్య విభాగం) డాక్టర్ జె. కె. జెనా, ఎన్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ బి. కె. బెహరా, కేంద్ర మత్స్య విభాగం సంయుక్త కార్యదర్శి (మెరైన్) డాక్టర్ సురభి రాయ్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఆవిష్కరణలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ వైవిధ్యీకరణ ద్వారా సముద్ర ఆహార ఎగుమతులను పెంచడంలో స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈల పాత్రను విశ్లేషించారు. ఈ చర్చలను మూడు ప్రధాన ఉప అంశాలుగా విభజించారు: (ఐ) విలువ జోడింపు, ఎగుమతుల ప్రోత్సాహం, (ఐఐ) అత్యంత విలువైన లోతైన సముద్ర వనరుల వినియోగం, (ఐఐఐ) ఎగుమతి అవకాశాల విస్తరణ.

మత్స్య రంగంలో ఆవిష్కరణలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతుల విస్తరణను పెంపొందించడానికి స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు అనుకూలమైన పటిష్ఠమైన వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని ఈ చర్చలు ప్రముఖంగా పేర్కొన్నాయి. చర్చలు ప్రధానంగా ప్రాసెసింగ్, పంట అనంతర మౌలిక సదుపాయాల బలోపేతం, అధిక విలువ కలిగిన, ప్రత్యేక సముద్ర ఆహార ఉత్పత్తుల ప్రోత్సాహం, ట్యూనా వంటి లోతట్టు సముద్ర మత్స్య వనరుల్లోని వినియోగంలోకి రాని సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం, అలాగే సముద్ర శైవలాల (సీవీడ్) సాగు, అలంకార మత్స్య పెంపకం, ముత్యాల రకాల జల చరాల పెంపకం, శీతల జల మత్స్య పెంపకం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల ద్వారా ఎగుమతి అవకాశాలను విస్తరించడంపై కేంద్రీకృతమయ్యాయి. భారత అంతర్జాతీయ పోటీతత్వాన్ని పెంచడానికి, ఉపాధి అవకాశాలను సృష్టించడానికి, సముద్ర ఆహార ఎగుమతుల్లో స్థిరమైన వృద్ధిని వేగవంతం చేయడానికి దోహదపడే విధానపరమైన చర్యలు, సాంకేతికతను అలవర్చుకోవడం, నైపుణ్యాభివృద్ధి, ధృవీకరణలు, బ్రాండింగ్, మెరుగైన మార్కెట్ అనుసంధానాల అవసరాన్ని ప్రతినిధులు ప్రముఖంగా చెప్పారు.భారత సముద్ర ఆహార ఎగుమతి రంగాన్ని బలోపేతం చేయాలనే కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల ప్రతినిధులు, ఎగుమతిదారులు, పరిశోధనా సంస్థలు, పారిశ్రామికవేత్తల ఉమ్మడి సంకల్పంతో సదస్సు ముగిసింది. సుస్థిర ఉత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తులు, మూలాల గుర్తింపు, ధృవీక రణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆవిష్కరణలు మార్కెట్ వైవిధ్యీకరణ వంటి అన్ని అంశా లను కలుపుకుంటూ ఒక సమన్వ య విధానంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఈ చర్చలు స్పష్టం చేశాయి. ఈ సదస్సు ద్వారా వెలువడిన సిఫార్సులు రాబోయే రోజుల్లో విధానాల రూపకల్పనకు సముద్ర ఆహార ఎగుమతుల్లో భారత అంతర్జాతీయ పోటీతత్వాన్ని పెంపొందించే లక్షిత చర్యలకు ఎంతగానో దోహదపడతాయని భావిస్తున్నారు.

# నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలి

## -జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

వరంగల్, జూన్ 8:రైతులకు నాణ్యమైన విత్తనాలనుమాత్రమే విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని పలు విత్తన,ఎరువులు, పురుగు మందుల షాపులను ఆమె సోమవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో పలు షాపులలో విత్తనాలకు సంబంధించిన ఇన్వాయిస్ పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు పరిశీలించారు.రైతులకు కంది విత్తనాలను అందుబాటులో ఉంచాలని, రైతులకు విత్తన కొనుగోలు సమయంలో విధిగా రశీదును ఇవ్వాలన్నారు . గడువు తీరిన పురుగుమందులను చట్ట ప్రకారం ప్రత్యేకంగా నిల్వచేయాలని, ఎరువుల నిల్వలను ఈ పాస్ యంత్రం స్టాక్ రిజిస్టర్ లో వ్యత్యాసం లేకుండా నమోదు చేయాలని సూచించారు. తనిఖీ లలో మండల వ్యవసాయ అధికారి ఏ. నాగరాజు పాల్గొన్నారు.

# బిహార్‌లో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు నెల్లూరు జిల్లా వాసులు మృతి

అమరావతి, జూన్ 8: తీర్థయాత్రలకు బయలు దేరిన నెల్లూరు జిల్లా వాసుల బస్సుకు ప్రమాదం జరిగి ముగ్గురు యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. లారీని ఓవర్ టేక్ చేయబోయిన యాత్రికుల ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైంది. మృతులు హాజరయ్య, వెంకటేశ్వర్లు, పద్మావతిగా గుర్తించారు.

జిల్లాలోని సంగం,ఆత్మకూరు, దుత్తలూరు గ్రామాలకు చెందిన 43 మంది ప్రయాణికులు కాశీ యాత్రకు బయలు దేరారు. ఆదివారం గయ్య పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని వారణాసికి వెళుండగా ఔరంగాబాద్ జిల్లాలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదానికి గురైంది.

# ఓటమి ఎరుగని నాయకురాలు నందిని సత్పతి

ఆమె ఒక రాష్ట్రపు తొలి మహిళా ముఖ్యమంత్రి. దేశంలో ముఖ్య మంత్రి పదవిని చేపట్టిన ద్వితీయ మహిళ. ఐదున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న నాయకురాలు. భారత దేశాన్ని అప్రతి హతంగా కొంతకాలం ఏలిన దేశ తొలి తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ కి అత్యంత సన్నిహితురాలు, విశ్వస నీయురాలు. ఆమెనే ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశాగా పేరెన్నిక గన్న నందిని సత్పతి.

నందిని సత్పతీ (1931 జూన్ 9 ? 2006 ఆగస్టు 4), జూన్ 1972 నుంచి డిసెంబరు 1976 వరకు ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేశారు. 1931 జూన్ 9న ఆమె జన్మించారు. ఆమె తండ్రి పద్మభూషణ్ కలాండి చరణ్ పాణిగ్రాహి ఒడిశాకు చెందిన సుప్రసిద్ధ వ్యక్తి. ఆమె తాత స్వనేశ్వర్ పాణిగ్రాహి గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆమె మామ భగవతి చరణ్ పాణిగ్రాహి ఒడిశాలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకులు. ఆమె రెండుసార్లు ధెంకనల్ నుండి ఎంపీగా ఎన్నికయ్యారు. 1972 లో, సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలోని నలుగురు మాజీ ముఖ్య మంత్రులతో ఆమె ఒంటరి పోరాటం చేసి విజయం సాధించారు.

రావెన్షా కళాశాలలో ఒడియాలో ఆర్ట్స్ లో మాస్టర్స్ డిగ్రీ చదివేటప్పుడు, ఆమె కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి శాఖ అయిన స్టూడెంట్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. 1951లో కళాశాల విద్యకు రుసుములు పెరిగిన నేపథ్యంలో ఒడిశాలో విద్యార్థులు నిరసన ఉద్యమం ప్రారంభించారు. ఆ తరువాత అది దేశవ్యాప్త ఉద్యమంగా రూపుదాల్చింది. ఆ ఉద్యమానికి నందిని నాయకత్వం వహించారు. ఆ సమయంలో ఆమెపై లాఠీ చార్జి కూడా జరిగింది. మిగిలిన ఆందోళన కారులతో పాటు నందినిని కూడా జైలులో పెట్టారు. అక్కడే మరో విద్యార్థి నాయకుడు దేవేంద్ర సత్పతీని కలిశారు ఆమె. తరువాత వారిద్దరూ వివాహం చేసుకున్నారు. దేవేంద్ర ధేన్కనల్ నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎంపిగా రెండు సార్లు ఎన్నికయ్యారు. నందిని సత్పతి 1962 లో రాజ్యసభలో ప్రవేశించారు. 1966 లో ఇందిరా గాంధీ ప్రధాని అయిన తరువాత, నందిని సత్పతిని తన మంత్రివర్గంలో సమాచార, ప్రసార ఉప మంత్రిగా, తదుపరి మంత్రిగా నియమించుకున్నారు. నందిని సత్పతిని ప్రధానమంత్రి ఇందిరా గాంధీ రాజకీయములో కుడి భుజంగా భావించే వారు.

బిజు పట్నాయక్ మరికొంత మంది కాంగ్రెస్



జూన్ 9...నందిని సత్పతి జయంతి

పార్టీ నుండి నిష్క్రమించిన కారణంగా 1972 లో నందిని సత్పతి ఒడిశాకు తిరిగి వచ్చి, ముఖ్యమంత్రి (జూన్ 1972 నుండి 1976 డిసెంబర్వ) అయ్యారు. అలా ఒడిశా మొదటి మహిళా ముఖ్యమంత్రిగా ఉన్నారు. భారత దేశంలో ముఖ్యమంత్రి అయిన రెండవ మహిళగా చరిత్రలో నిలిచారు. ఆమె వ్యక్తిత్వంలో ఫైర్ బ్రాండ్ నాయకత్వాన్ని గుర్తించిన ఇందిరా గాంధీ ఆశీస్సులతో నందిని ముఖ్యమంత్రిగా తొలి సారిగా జూన్ 14, 1972 లో బాధ్యతలు స్వీకరించారు.

భారత దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆమె పదవీకాలం ఒక సంవత్సరంలో ముగిసింది. మార్చి 6, 1973 నుండి డిసెంబర్ 16, 1976 వరకు ఆమె రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు.

నందిని సత్పతిని 'ఐరన్ లేడీ ఆఫ్ ఒడిశా' అని పిలిచేవారు. నందిని సత్పతి రాజకీయాలలోనే గాక ఒక రచయితగా గుర్తింపు పొందారు. ఆమె తస్లిమా నస్రీన్ నవల లజ్జాను ఒడియాలోకి అనువదించారు. అది ఆమె చేసిన ప్రధాన సాహిత్య రచన. నందిని సత్పతి సాహిత్య రచనలు ఇతర భాషల లోకి అనువదించబడి ప్రచురించ బడ్డాయి. ఒడియా సాహిత్యానికి ఆమె చేసిన కృషికి, ఆమె 1998 లో సాహిత్య భారతి సమ్మన్ అవార్డును అందుకుంది.

నందిని సత్పతి ముఖ్యమంత్రిగా ఒడిశా రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆమె ముఖ్య మంత్రిగా పనిచేసినప్పుడు, ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రకటించిన జాతీయ అత్యవసర పరిస్థితి ఆమె రాజకీయ జీవితంలో కష్టతరమైన సవాలు. కొందరు రాజకీయ నాయకులను అరెస్ట చేయడంతో ఆమె విమర్శలు ఎదుర్కొన్నారు. అల్లకల్లోల సమయంలో ఆమె చేసిన మితిమీరిన చర్యలకు ఆమె ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆమె చేసిన పనితీరు దాదాపు ప్రతి రంగంలోనూ వృద్ధిని సాధించింది. ముఖ్యంగా, మహిళల సాధికారత, గ్రామీణ వృద్ధి, కళ ,సంస్కృతి , విద్య వంటి రంగాలలో, ఆమె విశేషమైన చర్యలు తీసుకున్నారు. ఆ కార్యక్రమాలు నేటి వరకు ప్రజల జ్ఞాపకాలలో మరవలేనిది రాజకీయ పరిశీకులు పేర్కొంటారు. రైతులు లేదా వ్యవసాయ దారులు కాని భూములను తమ ఆధీనంలో ఉంచిన కొద్దిమంది వ్యక్తుల చేతుల నుండి భూములను విడిపించే ప్రత్యేకమైన భూ సంస్కరణల చట్టాన్ని తీసుకురావడం ఒక చరిత్రగా ఒడిశా రాష్ట్ర ప్రజలలో మిగిలి పోతుంది. తన యాభై-ఐదు సంవత్సరాల రాజకీయ జీవితంలో, ఆమె ఎన్నికలలో ఒక్క ఓటమిని కూడా ఎదుర్కోలేదు. ఎన్నికలలో ఆమె నలుగురు మాజీ ముఖ్యమంత్రులతో పోరాడి వారందరినీ ఓడించిన రికార్డును సొంతం చేసుకున్నారు.

నందిని సత్పతి 2006 ఆగస్టు 4 న భువనేశ్వర్‌లోని తన నివాసంలో అనారోగ్యంతో మరణించారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు : ఏడీఏ వాణిశ్రీ



ఖమ్మం, జూన్ 8: వానాకాలం సీజన్ దృష్ట్యా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు చేపడుతున్నామని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు, ఎర్రుపాలెం మండల ప్రత్యేక అధికారి వాణిశ్రీ హెచ్చరించారు. సోమవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని పలు విత్తన దుకాణాలను ఆమె సీడ్ టాన్క్ ఫోర్స్ సభ్యులు, వ్యవసాయ అధికారి బోయినపల్లి సాయి శివ, సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలకు సంబంధించిన ఇన్వాయిసులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విత్తనాల విక్రయదారులు తప్పనిసరిగా అవసరమైన పత్రాలు కలిగి ఉండాలని, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. సరైన పత్రాలు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే స్టాక్ బోర్డులను తెలుగు లోనే ప్రదర్శించాలని సూచించారు.

నిషేధిత హెచ్‌టీఎ (గడ్డి మందు తట్టుకునే) పత్తి విత్తనాల విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో రాత్రివేళల్లో ఎవరైనా అనుమానాస్పదంగా విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసులకు సమాచారం అందించాలని డీలర్లకు సూచించారు

. మండలంలో ప్రస్తుతం 13,550 పత్తి విత్తనాల ప్యాకెట్లు, 15,252 మిరప విత్తనాల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, అదనంగా వరి, మొక్కజొన్న విత్తనాలు కూడా సమృద్ధిగా నిల్వ ఉన్నాయని తెలిపారు. రైతులు విత్తనాల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా, నకిలీ విత్తనాల నివారణకు వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతుండడం హర్షణీయమని రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు బాలకృష్ణ, వంశీకృష్ణ, కృష్ణకుమారి, అనూష, డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**

సంగారెడ్డి, జూన్ 08(నేటి నిజం ప్రతినిధి ) ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజావాణిలో అందిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో కలెక్టరేట్‌లో 27, సంగారెడ్డి డివిజన్‌లో 17, ఆందోల్ డివిజన్‌లో 5, నారాయణఖేడ్



డివిజన్‌లో 11, జహీరాబాద్ డివిజన్‌లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.

అంతకుముందు, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రయోజనాలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో దాని ప్రాధాన్యత, అలాగే అతిసార వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరంభం మందగించినా, అంచనాలకు కట్టుబడి ఉన్న లాంక్సెస్

LANXESS
Energizing Chemistry

హైదరాబాద్, జూన్ 8: నిరంతరాయంగా బలహీనంగా ఉన్న ఆర్థిక వాతావరణం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, గత సంవత్సరపు పోర్ట్‌ఫోలియో విక్రయాలు వంటి అంశాలు స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లాంక్సెస్ 2026 ఆర్థిక సంవ త్సరం మొదటి త్రైమాసికంపై తమ ప్రభావాన్ని చూపాయి. అమ్మకాలు 1.378 బిలి యన్ యూరోలుగా నమోదయ్యాయి, ఇది గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 1.601 బిలియన్ యూరోల అమ్మకాల కంటే 13.9 శాతం తక్కువ. మినహాయింపు లకు ముందు ఈ బి ఐ టి ఏ 94 మిలియన్ యూరోలకు చేరుకుంది, ఇది అంతకుముం దు ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 133 మిలియన్ యూరోలతో పోలిస్తే 29.3 శాతం తగ్గుదల. మొదటి త్రైమాసికంలో మినహాయింపులకు ముందు ఈ బి ఐ టి ఏ మార్జిన్, గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఉన్న 8.3 శాతంతో పోలిస్తే 6.8 శాతంగా నమోదైంది. "సంవత్సరం ప్రారంభం బలహీనంగా ఉన్నప్పటికీ, మార్చి నుండి మేం స్వల్ప సాను కూల గమనాన్ని గమనించాం. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల కారణంగా, అనేక మంది ఆసియా పోటీదారుల సరఫరా గొలుసులు దెబ్బతిన్నాయి. దీనివల్ల కస్ట మర్లు మళ్లీ లాంక్సెస్ వంటి యూరోపియన్ సరఫరా దారుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం సరఫరా చేయగల సామర్థ్యం మాకు ఒక ముఖ్యమైన పోటీ ప్రయోజనంగా మారింది. అదే సమయంలో, ముడిసరుకులు, ఇంధనం, లాజిస్టిక్స్ పెరిగిన ఖర్చుల భారాన్ని అధిగమించడానికి మేం మా అనేక ఉత్పత్తుల ధరలను పెంచాము," అని లాంక్సెస్ సీఈఓ మథియాస్ జాచెర్ట్ అన్నారు.

# సంపూర్ణ క్రమ యజుర్వేద హవనం



రాజన్న సిరిసిల్ల, జూన్ 8: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర బ్రాహ్మణ నిత్యాన్న సత్రం, శ్రీ అభినవ విద్యా తీర్థ సదనంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు శ్రీకృష్ణ యజుర్వేద క్రమ పారాయణ పూర్వక సంపూర్ణ క్రమ యజుర్వేద హవనం నిర్వహించనున్నట్లు నిత్యాన్న సత్రం గౌరవాధ్యక్షులు ప్రతాప రామకృష్ణ తెలిపారు. బుధవారం యాగశాల ప్రవేశం, కలశ ప్రతిష్ఠ, దేవతా ఆహ్వానం కార్యక్రమాలతో హవనం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 7:30 వరకు హవనం నిర్వహించనున్నట్లు వివరించారు. 16వ తేదీన మహా పూర్ణాహుతి, వేద పండితుల సన్మానం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరా రు. సమావేశంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మామిడిపల్లి వెంకటేశం, చర్లపల్లి సీతారాములు, పురాణం రాము, సువర్ణ చందు, చొప్పకట్ల కార్తీక్ పాల్గొన్నారు.

# ఏషియన్ పెయింట్స్ 'యాంటీ-డాంప్ టెక్నాలజీ' ఆవిష్కరణ




హైదరాబాద్, జూన్ 8: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు అందంగా, సౌకర్యవంతంగా, ఏళ్ల తరబడి మన్నికగా ఉండాలని కోరుకుంటారు. అయితే, ఎకానమీ పెయింట్ విభాగంలో (అందుబాటు ధరల్లో ఉండే రంగులు) ఇవన్నీ ఉండే ఉత్పత్తులు చాలా వరకు కష్టమే. వీటన్నింటిలోనూ అత్యంత సాధారణమైన సమస్య గోడలపై వచ్చే నీటి మరకలు (వాటర్ మార్క్స్). ఇది ఇంటి అందాన్ని మెల్లగా దెబ్బతీస్తుంది. దీనిని గుర్తిస్తూ, ఈ సమస్యకు చెక్ పెట్టడానికి ఏషియన్ పెయింట్స్ 'ఏస్', 'ట్రాక్టర్ ఎమల్షన్ల'లో 'యాంటీ-డాంప్ టెక్నాలజీ'ని ఆవిష్కరించింది. అద్భుతమైన పనితీరు, ఆకర్షణీయమైన లుక్‌తో ఈ ఎకానమీ రేంజ్ ఉత్పత్తులపై నాలుగేళ్ల వారంటీని కూడా ఇస్తుంది. ఏషియన్ పెయింట్స్ అత్యంత నమ్మకమైన, విస్తృతంగా ఉపయోగిస్తున్న బ్రాండ్లలో ఒకటైన 'ఏస్', 'ట్రాక్టర్ ఎమల్షన్లు' ఎకానమీ విభాగంలో నాణ్యతను, విలువను అందించడం ద్వారా ఇంటి యజమానులు, డీలర్లు, కాంట్రాక్టర్ల నమ్మకాన్ని గెలుచుకున్నాయి. వినియోగదారుల అవసరాలను తీర్చడం కోసం ఈ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియో నిరంతరం కొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తూనే ఉంది. ఇందులో మెరుగైన విలువను అందించే 'ట్రాక్టర్ ఉ ఏస్ స్పార్క్', తక్కువ ధరలో మెరిసే రూపాన్ని అందించే 'ట్రాక్టర్ ఉ ఏస్ షైన్' కూడా ఉన్నాయి. యాంటీ-డాంప్ టెక్నాలజీ పరిచయంతో ఏషియన్ పెయింట్స్ ఇంటి యజమానులు ఎదుర్కొనే అత్యంత సాధారణ సవాళ్లలో ఒక దానికి పరిష్కారాన్ని చూపుతూ నమ్మకమైన వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తుంది. ఈ కొత్త సాంకేతికత గోడలపై నీటి మరకలు (వాటర్ మార్క్స్) పడకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ఈ ఆవిష్కరణ ద్వారా ఎకానమీ పెయింట్ విభాగంలోని వినియోగదారులకు దీర్ఘకాలిక మన్నికను, మానసిక ప్రశాంతతను అందించడమే కంపెనీ లక్ష్యం. ఈ ముఖ్యమైన విషయాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో తెలియజేయడానికి సరికొత్త క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ యాడ్ ఫిల్మ్ లో ఒక ఇంటి యజమాని తన ఇంటికి వచ్చిన అతిథికి ఆతిథ్యం ఇస్తున్నప్పుడు 'నీటి మరక' (వాటర్ మార్క్) పదేపదే వారి మధ్యలోకి వస్తూ ఎలా అంతరాయం కలిగిస్తుందో చూపిస్తుంది. ఆ ఇంటి యజమాని ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, అత్యంత అసౌకర్యమైన సమయాల్లో ఆ నీటి మరక మళ్లీ మళ్లీ ప్రత్యక్షమవుతూ ఉంటుంది. గోడలు తడిసి ఆరిపోయిన తర్వాత వచ్చే నీటి మరకల వల్ల ఎదురయ్యే రోజువారీ ఇబ్బందులను ఈ కథనం కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. అదే సమయంలో యాంటీ-డాంప్ టెక్నాలజీ ఇటువంటి సమస్యలను ఎలా నివారిస్తుందో నొక్కి చెబుతుంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం- మేయర్ శ్రీనివాస్



కరీంనగర్, జూన్ 8:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ప్రత్యేక వార్డు సభలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత వంటి సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, వినతులను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి వార్డులో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని మేయర్ పేర్కొన్నారు. గతంలో కేటాయింపులు జరగక శిథిలావస్థకు చేరిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిస్తూ, టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్- 154 దరఖాస్తుల రాక**

రాజన్న సిరిసిల్ల, జూన్ 08: ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగ తిన పరిష్కరించాలని సూచిం చారు. మొత్తం దరఖాస్తులు 154 వచ్చాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వాణిని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు పాల్గొన్నారు.

ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

ముఖ్య అతిథి : లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్
సభాధ్యక్షులు : శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్థన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం
పురస్కార గ్రహీత : శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజిషియన్
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్
ఆత్మీయ అతిథి : శ్రీమతి పాతూరి జయలక్ష్మీ, మేనేజర్ సాహితీ కిరణం
పురస్కార ప్రదాత : శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్
వందన సమర్పణ : శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్థని



లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్,
మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.